

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 24-02-2023 సంపుటి : 04 సంచిక : 159 పేజీలు : 4 వెల : రూ 3-00

# నేడు ఏపి గవర్నర్‌గా అబ్దుల్ నజీర్ ప్రమాణం




ప్రమాణస్వీకారోత్సవానికి ముస్తాబైన రాజ్‌భవన్
విజయవాడ చేరుకున్న నజీర్‌కు సిఎం జగన్ ఘనస్వాగతం



అమరావతి,ఫిబ్రవరి23 : ఏపీ కొత్త గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఈ నెల 24న శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకార ఘట్టానికి రాజ్ భవం ముస్తాబు అయింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆయన చేత ప్రమాణం చేయిస్తారు. ఈ కార్యక్రమానికి సిఎం జగన్ సహా మంత్రులు, పలుఉవరు విఐపిలు హాజరు కానున్నారు. దీంతో భారీగగా ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే గత రాత్రి గన్నవరం ఎయిర్ పోర్టుకు ప్రత్యేక విమానం ద్వారా వచ్చిన గవర్నర్ నజీర్‌కి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. విజయవాడలో గవర్నర్ బస చేసిన రాజ్ భవన్‌కి వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దాదాపుగా గంట పాటు ఈ ఏకాంత భేటీ సాగిందని తెలుస్తోంది. ఏపీకి కొత్త గవర్నర్‌గా వచ్చిన నజీర్‌తో సిఎం జగన్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు చర్చ సాగుతోంది. గవర్నర్ ప్రమాణస్వీకారం తరవాత త్వరలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై సిఎం జగన్ దృష్టి సారించనున్నారు. ఏపీలో ప్రభుత్వం నాలుగేళ్ళుగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వం పెట్టుకున్న ప్రాధాన్యతలు వంటి వాటి మీద జగన్ గవర్నర్ కి వివరించి ఉంటారని అంటున్నారు. ఏపీకి కొత్త గవర్నర్ గా నియమితులైన అబ్దుల్ నజీర్ న్యాయమూర్తిగా అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సుదీర్ఘ కాలం పనిచేసి ఉన్నారు. ఆయనకు రాజ్యాంగ పరమైన అంశాలలో ఎంతో నిపుణత ఉంది. ఒక విధంగా అచ్చమైన రాజ్యాంగ నిపుణుడిగా పేర్కొనాలి. అదే సమయంలో ఆయన గవర్నర్ గా రాజ్యాంగబద్ధమైన విధులను నిర్వహించబోతున్నారు. రాజ్యాంగపరంగా ఏది సహేతుకమో ఏది అవసరమో గవర్నర్‌గా ఆయనకు క్షుణ్ణంగా అవగాహన ఉంటుంది. ఇక రాజకీయపరంగా చూస్తే ఆయన పొరుగునే ఉన్న కర్నాటకకు చెందిన వారు. ఏపీ రాజకీయాల మీద కచ్చితంగా చాలా వరకూ అవగాహన ఉంటుందని అంటున్నారు.ఆయన క్రియాశీలంగా ఉండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఎన్నికలు ఏడాదిలో ఉన్న ఏపీలో ఏరికోరి కేంద్రం ఆయనను ఏపీకి గవర్నర్ గా పంపడం వెనక చాలా వ్యూహం ఉండివుంటుందని అంటున్నారు. ఇకపోతే మూడున్నరేళ్ళుగా పాత గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ తో వైసీపీ ప్రభుత్వానికి అంతా సాఫీగా సాగిపోయింది. కొత్త గవర్నర్ నజీర్ తో కూడా అదే సయోధ్యను వైసీపీ ప్రభుత్వం కోరుకుంటోంది. అయితే ఇక్కడ అబ్దుల్ నజీర్ కి కూడా గవర్నర్ పదవి కొత్త అనుభవమే. అయినా కానీ ఆయన రాజ్యాంగ పరిరక్షకుడిగా మాత్రం సీనియర్ కాబట్టి గవర్నర్‌గా తన పదవీ నిర్వహణ ఉంటుందని అంటున్నారు.

# టిడిపిలో చేరిన మాజీమంత్రి కన్నా

పసుపు కండువా కప్పి స్వాగతించిన చంద్రబాబు
అంచలంచెలుగగా ఎదిగిన నేత కన్నా అని బాబు కితాబు
భారీ ర్యాలీలతో టిడిపి ఆఫీసెకు వచ్చిన కన్నా



అమరావతి,ఫిబ్రవరి23 : బిజెపిని వీడిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ తెలుగుదేశం పార్టీలో చేరారు. గుంటూరులోని తన నివాసం నుంచి అనుచరులు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ముందుగా నిర్ణయించుకున్న ముహూర్తం ప్రకారం.. మధ్యాహ్నం 2.48 గంటలకు చంద్రబాబు సమక్షంలో కన్నా తెలుగుదేశం పార్టీలో చేరారు. చంద్రబాబు పసుపు కండువా కప్పి.. కన్నా లక్ష్మీనారాయణను పార్టీలోకి ఆహ్వానించారు. కన్నాతో పాటు ఆయన అనుచరులు టీడీపీ కండువా కప్పుకున్నారు. కన్నా చేరిక సందర్భంగా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. కన్నా లక్ష్మీనారాయణ పార్టీలోకి రావడం శుభపరిణామమని అన్నారు. కన్నాను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో తనకంటూ ఒక ప్రత్యేకత ఉన్న వ్యక్తి కన్నా లక్ష్మీనారాయణ అని అన్నారు. విద్యార్థి దశ నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2004 నుంచి 2014 వరకు మంత్రిగా సేవలందించారు. రాజకీయాల్లో నిబద్ధత ప్రకారం కన్నా పనిచేశారు. పదవులు ఎప్పుడూ శాశ్వతం కాదు.. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం అని చంద్రబాబు కొనియాడారు. తెలుగుదేశం రాష్ట్ర కార్యాలయంలో పార్టీ శ్రేణులు కన్నాకు అపూర్వ స్వాగతం పలికారు. అలాగే గుంటూరు మాజీ మేయర్, కన్నా కుమారుడు నాగరాజు, తాళ్ల వెంకటేశ్ యాదవ్, మాజీ ఎంపీ లాల్‌జాన్‌బాషా సోదరుడు, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎమ్ నిజాముద్దీన్ తదితరులు టీడీపీలో చేరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కన్నా అనుచరులు, పలువురు సీనియర్ నాయకులు వేలాది మంది ద్వితీయ శ్రేణి నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అంతకుముందు కన్నా లక్ష్మినారాయణ గుంటూరులోని తన నివాసం నుంచి 3 వేల మంది కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీగా మంగళగిరి టీడీపీ కార్యాలయానికి తరలి వచ్చారు. కాగా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్న కన్నా... ఇప్పటికే తన అనుయాయులతో సమావేశమై వారిని తనతో పాటు పార్టీలో చేర్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. నిత్యం జనం మధ్య ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే కన్నాకు ఏ పార్టీలో ఉన్నా జనాదరణ మెండుగా ఉంటుందని.. ముఖ్యంగా గుంటూరు జిల్లాలో కాపు సామాజికవర్గంలో ఎంతో పట్టుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు. అందుకే ఆయన చేరికను వారంతా స్వాగతించారు.

# వివేకా హత్యకేసులో సీఎం జగన్ అడ్డంగా దొరికిపోయారు: చంద్రబాబు

మంగళగిరి: అమరావతి అభివృద్ధి కావాలనే ఉద్దేశంతో కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ను వీడి కన్నా లక్ష్మీనారాయణ తెలుగుదేశం పార్టీలోకి వచ్చారని ఆ పార్టీ అధినేత చంద్రబాబు తెలిపారు.కన్నాకు తెదేపా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన



అనంతరం చంద్రబాబు మాట్లాడారు. జగన్ పాలనలో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ విధ్వంసానికి గురయ్యాయని మండిపడ్డారు. "రాష్ట్రంలో ఏ ఒక్క రైతు కూడా ఆనందంగా లేదు. పంటలకు గిట్టుబాటు ధర లభించట్లేదు. విద్యారంగంలో ఏపీ 19వ స్థానానికి దిగజారింది. రాష్ట్రంలో సంక్షేమం అడ్రస్ లేకుండా పోయింది. కార్పొరేషన్లన్నీ మూసివేసే పరిస్థితి వచ్చింది. గ్రామీణ వ్యవస్థ మొత్తం నిర్వీర్యమైంది" అని జగన్ సర్కార్‌పై చంద్రబాబు ధ్వజమెత్తారు."రాష్ట్ర సంపదంతా తన వద్దే ఉండాలనే ఆర్థిక ఉగ్రవాది జగన్. అందరూ బానిస జీవితం గడపాలనేది ఆయన ఉద్దేశం. రాష్ట్ర ప్రజలు పేదలయ్యారు.. జగన్ ధనవంతుడవుతూనే ఉన్నారు. పేదల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి మద్యం విక్రయిస్తున్నారు. నాసిరకం మద్యం బ్రాండ్లతో ప్రజలను దోచుకుంటున్నారు. గత సీఎంలలో కొందరు అవినీతిపరులు, మరికొందరు అసమర్థులు ఉన్నారు. కానీ, జగన్ మాదిరి విధ్వంసం చేసిన వారు మాత్రం లేరు. ఏ సీఎం అయినా మంచిపేరు తెచ్చుకునేందుకు తపిస్తారే తప్ప.. జగన్‌లా వ్యవస్థలపై దాడులు చేయరు. సమావేశాలు పెట్టకూడదని జీవో నంబర్ 1 తీసుకువచ్చారు. అనపర్తిలో సమావేశం పెట్టినప్పుడు అడ్డంకులు సృష్టించారు. గతంలో జగన్ పాదయాత్ర చేసినప్పుడు ఇష్టానుసారం వ్యాఖ్యలు చేశారు. ఆనాడు మేం తలచుకుంటే పాదయాత్రలు చేసేవారా? జగన్ చెప్పినట్లు పోలీసు వ్యవస్థ నడుచుకుంటోంది.వివేకా హత్య కేసులో.. హూ కిల్డ్ బాబాయ్ అన్న ప్రశ్నకు అబ్బాయ్ కిల్డ్ బాబాయ్ అని సీబీఐ అఫిడవిట్‌లో స్పష్టంగా పేర్కొంది. కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ఇంట్లోనే హత్యకు కుట్ర పన్నినట్లు వెల్లడించింది. బాబాయ్‌ను చంపిన విధానం ఎవరూ ఊహించరు. ఈ కేసులో జగన్ గూగుల్ టేక్ అవుట్‌లో అడ్డంగా దొరికారు. తప్పు చేసి ఇతరులపై నెట్టివేయాలని చూశారు. బాబాయ్‌ను చంపాక ఆనాడు జగన్ ఆడిన నాటకం ఎవరి ఊహకు అందదు. ఇలాంటి జగన్ నాటకాలు నమ్మి నరహంతకుడికి ప్రజలు ఓట్లేశారు. ఈరోజు వారి ప్రాణాలకే రక్షణ లేకుండాపోయింది. రాష్ట్రంలో ఐపీసీ చట్టం లేదు.. వైకాపా చట్టం ఉంది. పేటీఎం బ్యాచ్ రాష్ట్రాన్ని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోం. జగన్ కోసం అధికారులు బలిపశువులు కావొద్దు. పోలీసులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రజలను చైతన్యం చేసే దిశగా ముందుకు వెళ్తా. దీనికి ప్రజలు కూడా స్వచ్ఛందంగా కదిలి రావాలి. మధ్యంతర ఎన్నికలకు జగన్ సిద్ధమవుతున్నారు. ఎప్పుడు ఎన్నికలు పెట్టినా జగన్‌ను ఇంటికి సాగనంపాలి. అందరూ సమష్టిగా ముందుకెళ్లి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# 'ఆర్థిక నేరాల్లో అగ్రగణ్యుడు రామోజీ'

తాడేపల్లి: టీడీపీ నేత పట్టాభిని కొట్టారంటూ ఈనాడు తప్పుడు వార్తలు రాయడంపై మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. పనిగట్టుకుని ప్రభుత్వంపై ఈనాడు పత్రిక దుష్ప్రచారం చేయడంలో భాగంగానే పట్టాభిని కొట్టారంటూ తప్పుడు వార్తను ప్రచురించిందని ధ్వజమెత్తారు. 2021 ఫిబ్రవరి ఫోటోలను ఈనాడు ప్రచురించి.. ప్రస్తుతం ఘటనకు ఆపాదించే ప్రయత్నించడం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడంలో భాగం కాదా? అని ప్రశ్నించారు.కుట్ర పన్ని ఈనాడులో రామోజీ బ్యానర్ వార్తను ప్రచురించారని అంబటి విమర్శించారు. రేపు సాయంత్రంలోగా రామోజీ బహిరంగం క్షమాపణలు చెప్పాలని, లేకుంటే రామోజీపై పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. పథకం ప్రకారం టీడీపీ కుట్రలకు పాల్పడుతోందని, పట్టాభిని కొట్టారంటూ దుష్ప్రచారం చేస్తోందన్న అంబటి.. చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలనే తపన రామోజీలో కనబడుతోందన్నారు. గన్నవరం ఘటనలో పోలీసులపై టీడీపీ దాడి చేసి సీఐని గాయపరిచిన సంగతిని గుర్తుచేశారు. ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా ఈనాడు వ్యవరిస్తోందని మండిపడ్డారు. రామోజీ అనేక చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారని, ఆర్థిక నేరాల్లో అగ్రగణ్యుడు రామోజీనేనని అంబటి ఘాటుగా వ్యాఖ్యానించారు.నైతిక విలువలు లేనటువంటి వ్యక్తి కన్నా లక్ష్మీనారాయణ అని అంబటి విమర్శించారు. చంద్రబాబు చేతిలో కన్నా రాజకీయ భవిష్యత్ శూన్యమని, తిన్నింటి వాసాలు లెక్కబెట్టడం కన్నాకు అలవాటని అంబటి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన కన్నా.. ఇప్పుడు టీడీపీలోకి వెళ్లాడని, అసలు కన్నాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఎందుకిచ్చారో తెలియదన్నారు మంత్రి అంబటి.



# నూతన గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన సీఎం జగన్ దంపతులు



విజయవాడ: నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దంపతులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు రాజ్‌భవన్‌లో గురువారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఏపీ గవర్నర్‌గా అబ్దుల్ నజీర్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్ భవన్ లో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి.కాగా, నూతన గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు సీఎం జగన్ సాదర స్వాగతం పలికారు. జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి 8.15 గంటలకు ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

# రామోజీ లాంటి వాళ్లను ఆనాడు ఎన్టీఆర్ పట్టించుకోలేదు: కొడాలి నాని

తాడేపల్లి: టీడీపీ, ఈనాడు రామోజీరావుపై మాజీ మంత్రి కొడాలి నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు వార్తలతో ఈనాడును దిగజార్చుకున్న వ్యక్తి రామోజీరావు.తాను ఏది చెబితే అది ప్రజలు నమ్ముతారని రామోజీరావు అనుకుంటున్నారు. రామోజీలాంటి వాళ్లను ఆనాడు ఎన్టీఆర్ పట్టించుకోలేదు అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.కాగా, కొడాలి నాని శుక్రవారం మీడియాతో? మాట్లాడుతూ.. 'చంద్రబాబును సీఎం చేయాలన్నదే రామోజీరావు లక్ష్యం. అందుకే రామోజీ అసత్య కథనాలు, అభూత కల్పనలు చేశారు. పట్టాభి పాత ఫొటోలతో రామోజీ సిగ్గులేని రాతలు రాశారు. రామోజీ లాంటి వాళ్లను ఆనాడు ఎన్టీఆర్ పట్టించుకోలేదు. అందుకే ఆనాడు ఎన్టీఆర్ మీద పేజీల మీద పేజీలు రాశారు. ఎన్టీఆర్ తెచ్చిన మద్యపాన నిషేధాన్ని ఎత్తివేయించిన ఘనుడు రామోజీరావు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి ఎన్టీఆర్‌పై తప్పుడు ప్రచారం చేశారు. ఇప్పుడు గన్నవరం ఘటనకు సంబంధి తప్పుడు వార్తలు రాసినట్టే అప్పుడు ఎన్టీఆర్‌పై పేజీల మీద పేజీలు వ్యతిరేక వార్తలు రాశారు అంటూ తీవ్ర విమర్శలు చేశారు.ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ఎల్లో మీడియాకు కనిపించట్లేదు. తప్పుడు వార్తలతో ఈనాడును దిగజార్చుకున్న వ్యక్తి రామోజీరావు. చంద్రబాబు, రామోజీ కుట్ర మేరకే ఈనాడులో దుష్ప్రచారం. అసత్యాలను సత్యాలుగా నమ్మించాలనేదే రామోజీ కుట్ర. ఈనాడు తప్పుడు వార్తలపై కనీకనిపించని రీతిలో సవరణ వేశారు. టీడీపీ హయంలో దుష్టచతుష్టం కలిసి కోట్లాది రూపాయలు దోచుకున్నారు. తప్పుడు ఫొటోలు ప్రచురించి పత్రికా విలువను రామోజీ దిగజార్చారు. ఈనాడు తప్పుడు వార్తలపై రామోజీ క్షమాపణ చెప్పాలి. లేకుంటే మీ కుట్రలు, కుతంత్రాలను ప్రజల ముందు పెడతాం. మళ్లీ రాష్ట్రాన్ని దోచుకోవడానికే కుట్రలు పన్నుతున్నారు. రెండేళ్ల కిందటి ఫొటోలు ప్రచురించి సాంకేతిక సమస్య అని చెబుతున్నారు. రామోజీ పిచ్చిరాతలను చూస్తూ ఊరుకునేది లేదు. ఇకపై ఒళ్లు దగ్గర పెట్టుకుని రామోజీ వార్తలు రాయాలి. ఇప్పటికైనా రామోజీ బుద్ధి తెచ్చుకుని సరైన ఖండన ఇవ్వాలి.ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అధిక భాగం కేటాయించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాజిక విప్లవానికి తెరతీశారు. ఎన్టీఆర్, మహానేత వైఎస్సార్ తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చింది సీఎం జగనే. అందుకే చంద్రబాబు, ఎల్లో మీడియా కుట్రకు తెరలేపారు. పట్టాభిని గన్నవరం ఎవరు పంపించారు.

# సంపాదకీయం

శుక్రవారం 24-02-2023

## ఏటా 15 లక్షల మందికి కుక్క కాటు

అంబర్ పేటలో వీధి కుక్కలు చిన్న పిల్లవాడ్ని చంపడంతో ఇప్పుడు వీధి కుక్కలపై అంతట విస్తృత చర్చ జరుగుతోంది. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా వీధి కుక్కల సమస్య భారత్‌లో ఉంది. భారత్‌లో ఏటా 15 లక్షల మంది కుక్క కాటుకు గురవుతున్నారని ఒక అంచనా. భారత్‌లో రేబిస్ వ్యాధితో ఏటా 20 వేల మంది చనిపోతున్నారు. వీరిలో 40% మంది 15 ఏళ్లలోపు వారే. అయితే సమస్య తీవ్రంగా ఉన్నదని తెలిసి కూడా ప్రభుత్వాలు కట్టడి చేయలేకపోతున్నాయి. భారతదేశంలో సుమారు 30లక్షల వీధి కుక్కలు ఉన్నట్లు ఒక అంచనా. భారతీయులు కుక్కలకు ఆహారం వేసి పెంచి పోషిస్తారు. కుక్కల సంఖ్య పెరగడానికి ఇదొక కారణం. రాత్రి సమయంలో వీధుల్లోకి వెళ్తే ఎక్కడపడితే అక్కడ కుక్కల అరుపులు వినిపిస్తాయి. అవి ఎప్పుడు ఎలా దాడి చేస్తాయో ఊహించలేం. ఈ సమస్యను పరిష్కరించడం చాలా కష్టం. ఎందుకంటే కుక్కలను చంపడం నేరం. అలా అని వీటికి వాక్సిన్ వేయించే ప్రయత్నం కూడా పూర్తిగా ఫలించడం లేదు. వీధి కుక్కల సమస్యకు పరిష్కారం లభించే వరకు భారతదేశంలోని ప్రధాన నగరాలు ప్రమాదంలో ఉన్నట్లేనని నిపుణులు చెబుతున్నారు '2021 స్టేట్ ఆఫ్ పెట్ హోమ్ లెస్‌నెస్ ఇండెక్స్' నివేదిక ప్రకారం? మిగతా దేశాల కంటే పెంపుడు జంతువులను వదిలించుకోవడం ఇండియాలో ఎక్కువ. ఇండియాలో 50 శాతానికి పైగా ప్రజలు తమ పెంపుడు జంతువులను వదిలించుకున్నట్లు అంగీకరించారు. మిగతా దేశాల్లో ఇది 28 శాతమేవీధి కుక్కల సమస్యకు పరిష్కారం అనగానే అందరికీ వచ్చే మొదటి ఆలోచన వాటిని చంపేయడం. అయితే ఈ పద్ధతిని పాటించడానికి ప్రయత్నించిన చాలా దేశాలు విఫలమయ్యాయి. ఇండియాలో వీధి జంతువులను చంపడం చట్ట విరుద్ధం. అయినా ఈ పద్ధతిని అనుసరించారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. కారణం కుక్కల్లో గర్భ ధారణ సమయం రెండు నెలలే. అంతే కాకుండా అవి ఎక్కువ పిల్లలకు జన్మనిస్తాయి. అంటే ఏదైనా పట్టణం లేదా గ్రామంలో వీధి కుక్కలను పూర్తిస్థాయిలో చంపేయాలంటే ఆ ప్రక్రియను రెండు నెలల్లోనే పూర్తిచేయాల్సి ఉంటుంది. లేకుంటే వీధి కుక్కల సంఖ్య గరిష్ట పరిమితికి చేరుకుంటుంది. వీధి కుక్కల సమస్యకు ప్రపంచ ఆరోగ్య సంస్థ కొన్ని రకాల పరిష్కారమార్గాలను సూచించింది. అందులో ఒకటి పెంపుడు కుక్కలకు సంతానం కలగకుండా శస్త్ర చికిత్స చేయాలి. రెండోది పెంపుడు జంతువుల నియంత్రణా చట్టాలను కఠినంగా అమలుచేయాలి. తద్వారా వీధి కుక్కల సంఖ్యను కొంతమేర నియంత్రించవచ్చు. ప్రభుత్వాలు ప్రస్తుతం అదే పని చేస్తున్నాయి. వీధి కుక్కల సమస్యకు హేతుబద్ధమైన పరిష్కారం కనుగొనాలని గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వాటి విచారణలో వీధికుక్కల బెడదకు పరిష్కారం కనుగొనాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పిన సుప్రీంకోర్టు.. ఒక వ్యక్తిపై వీధి కుక్కల దాడి జరిగితే అతనికి టీకాలు వేయడం, ఆసుపత్రి చికిత్స ఖర్చులు భరించడం కుక్కకు ఆహారం ఇస్తున్న వ్యక్తి బాధ్యత అని తెలిపింది. వీధికుక్కల బెడదకు పరిష్కారం కనుగొనడం, వీధికుక్కలకు ఆహారం అందించే వ్యక్తుల మధ్య సమతుల్యతను సృష్టించడం, వీధికుక్కల దాడుల నుండి అమాయక ప్రజలను రక్షించడం చాలా అవసరమని ధర్మాసనం ఉద్ఘాటించింది. ఆహారం లేకపోవడం వల్ల కుక్కలు దూకుడుగా మారవచ్చు లేదా అవి వ్యాధి బారిన పడవచ్చు. రేబిస్ సోకిన కుక్కలను సంబంధిత అధికారులు సంరక్షణ కేంద్రాల్లో ఉంచవచ్చని బెంచ్ సూచించింది. అయితే ఇవన్నీ ఆచరణలో సాధ్యం కావడం లేదు. వీధి కుక్కలకు ఎవరు ఆహారం వేస్తున్నారో చెప్పడం కష్టం.వీధి కుక్కల సమస్య చాలా పెద్దది. కానీ ఎలా పరిష్కరించాలో మాత్రం అర్థం కాని సమస్యగా మారింది.

# రాజధాని గందరగోళం



విజయవాడ, ఫిబ్రవరి 23, ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏదీ అంటే మాత్రం... కొద్ది సేపు ఆలోచనలో పడిపోతారు. అమరావతా ? విశాఖపట్నమా ? అని కొద్ది సేపు థింక్ చేస్తారు. విద్యార్థులు, సామాన్యుల సంగతి పక్కన పెడితే.. ఏపీ రాజధాని ఏది అనే ప్రశ్నకు... రాజకీయ నేతల నుంచి ఒకే సమాధానం రావడం లేదు. రాష్ట్ర రాజధానిపై అదే గందరగోళం. అవే సందేహాలు. రోజుకో భిన్నాభిప్రాయం.. !ప్రజా జీవనానికి సంబంధించి ఏదైనా సమస్య ఏర్పడితే.. ఎక్కువ మంది సమస్యకు వీలైనంత త్వరగా పరిష్కారం దొరకాలని ఆశిస్తారు. కానీ.. అదే సమస్య, దాని పరిష్కారం.. ఎన్నికల రాజకీయాలతో ముడిపడి ఉంటే మాత్రం.. పొలిటికల్ పార్టీలు దాన్ని అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తాయి. సమస్యను సాల్వ్ చేయడంలో కన్నా... దాన్ని కొనసాగించి, రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తుంటాయి. ప్రజాస్వామ్యంలో ఈ వైఖరి తప్పుకదా ? అని సాధారణ ప్రజలు అనుకోవచ్చు. కానీ ఓట్ల సాధనే లక్ష్యంగా సాగుతోన్న ప్రస్తుత రాజకీయాల్లో... తప్పు, ఒప్పుల గురించి పార్టీలు ఆలోచించాలని మనం ఆశించడం కూడా అత్యాశే అయిపోయింది."తాము మోసపోయామని ప్రజలను ఒప్పించడం కన్నా.. ప్రజల్ని మోసం చేయడమే సులువు" అని అమెరికాకు చెందిన ప్రముఖ రచయిత మార్క్ వెయిన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజధానుల విషయంలో కొనసాగుతున్న రాజకీయాలు... వెయిన్ మాటలను ఇప్పుడు స్ఫురణకు తెస్తున్నాయి. ఏపీకి మూడు రాజధానులు ఉండాలా ? లేక సంప్రదాయంగా ఒకే రాజధాని.. అది కూడా అమరావతే అయి ఉండాలా ? ఈ అంశాల్లోనే ఇప్పుడు వివాదం కొనసాగుతోంది. విశాఖ కేంద్రంగా పరిపాలన ప్రారంభించేందుకు అధికార పార్టీ ఓ వైపు వేగంగా పావులు కదుపుతోండగా... మరోవైపు విపక్షాలు మాత్రం ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతే అని నినదిస్తున్నాయి. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా.. అమరావతి రాజధాని స్టేటస్ ను తొలగించలేవని ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నాయి. మరోవైపు.. మీరు ఇలాగే మాట్లాడుతూ ఉండండి.. మేము త్వరలోనే విశాఖ నుంచి గవర్నెన్స్ మొదలు పెడతామన్నట్లుగా... సీఎం జగన్ సర్కార్ చకచకా ఏర్పాట్లు చేసుకుంటూ పోతోంది.విశాఖ నుంచి పరిపాలన ప్రారంభించేందుకు సీఎం జగన్ ఆతృతగా ఉన్నారని.. ప్రభుత్వ తీరుని చూస్తే స్పష్టం అవుతోంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన పెట్టుబడిదారుల సమావేశంలో మాట్లాడుతూ... ఇదే విషయాన్ని క్లియర్ చేసిన ముఖ్యమంత్రి జగన్.. విశాఖ నుంచే ప్రభుత్వం పనిచేస్తుందని తేల్చి చెప్పారు. ఆ వెంటనే.. బెంగళూరులో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సన్నాహక సమావేశంలో... ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజధాని గందరగోళాన్ని మరింత పెంచాయి. మూడు రాజధానులపై కొత్త పల్లవి ఎత్తుకున్నారాయన. అసలు మూడు రాజధానులు అనేదే తప్పుగా వెళ్లిన సందేశమని... అది సమాచార లోపం అని సంచలన వ్యాఖ్యలు చేశారు. పరిపాలన విశాఖపట్నం నుంచే జరుగుతుందని.. ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను చూస్తే.. రాజధానిగా అదే ఉత్తమంగా అభివర్ణించారు. ఇన్నాళ్లూ... వైఎస్సార్సీపీ చెబుతూ వస్తోన్న మూడు రాజధానుల కాన్సెప్ట్ కు.. బుగ్గన వ్యాఖ్యలు వ్యతిరేకంగా ఉండటం గమనార్హం. 3 రాజధానులు అనేదీ ఏమీ లేదని.. విశాఖ ఒక్కటే ఏపీ కేపిటల్ అని.. బుగ్గన మాటల ద్వారా అర్థం అవుతోంది. మంత్రి మాటలు... రాజధానిపై వివాదాన్ని మరింత ముదిరేలా చేశాయి. అమరావతి కోసం కొట్లాడుతోన్న కృష్ణా, గుంటూరు రైతులకి వారి వాదాన్ని బలపరుచుకునే ఆయుధాన్ని అందించాయి.2019లో ఏపీకి 3 రాజధానుల ఫార్ములా ప్రకటించిన వైఎస్సార్సీపీ సర్కార్... ఇందుకోసం రూపొందించిన చట్టాన్ని వివాదాలు, కోర్టు ఆదేశాలతో 2021లో వెనక్కి తీసుకుంది. మూడు ప్రాంతాలకు న్యాయం చేసేలా.. మూడు రాజధానుల కోసం సమగ్రమైన చట్టాన్ని మళ్లీ తీసుకొస్తామని ఆ సందర్భంగా సీఎం జగన్ ప్రకటించారు. వివాదం కోర్టుకి చేరగా... అమరావతినే రాజధానిగా కొనసాగించాలని హైకోర్టు తీర్పునిచ్చింది. 6 నెలల్లో అభివృద్ధి చేయాలని ఆదేశించింది. ఈ తీర్పుని సవాల్ చేస్తూ.. ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టుని ఆశ్రయించింది. ప్రస్తుతం ఈ అంశం సర్వోన్నత న్యాయస్థానం పరిధిలో ఉంది. ఇలా.. కేపిటల్ అంశం న్యాయస్థానాల్లో విచారణ దశలో ఉన్నా... అధికార పార్టీ విశాఖ కేంద్రంగా పరిపాలన ప్రారంభించేందుకు వేగంగా అడుగులు వేస్తుండటం.. అనేక సందేహాలు రేపుతోంది. నిజంగానే అన్నంత పనిచేస్తుందా ? లేక పెట్టుబడులను ఆకర్షించడానికే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారా అనే క్వశ్చన్స్ ఉత్పన్నం అవుతున్నాయి. ఈ అంశాన్ని ఇలాగే వచ్చే ఎన్నికల వరకు నాన్చుతుందా ? అనే ప్రశ్నలు వస్తున్నాయి."మూడు రాజధానాలు అనేది మిస్ కమ్యూనికేషన్" అని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వ్యాఖ్యానించిన రెండో రోజే... ప్రభుత్వ ప్రధాన సలహాదారు.. సీఎం జగన్ కి అత్యంత ఆప్తులు సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ... మూడు రాజధానులకే వైఎస్సార్సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని తేల్చి చెప్పారు. సజ్జల చెబితే.. జగన్ చెప్పినట్లే అనే టాక్ ఏపీ పొలిటికల్ సర్కిల్స్ లో ఉంది. దీన్నిబట్టి చూస్తే.. విశాఖను పరిపాలనా రాజధానిగా చేసినా... మూడు రాజధానుల అంశాన్ని వైఎస్సార్సీపీ ఇప్పట్లో పక్కన పెట్టే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో.. అధికార పార్టీ ప్లానేంటో.. విపక్షాలకూ అంతుచిక్కడం లేదని విశ్లేషకులు అంటున్నారు. విశాఖ.. మూడు రాజధానాలు.. అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధి.. ! ఇలా మూడు అంశాలతో ముందడుగు వేస్తున్న వైఎస్సార్సీపీ... వ్యూహాత్మకంగా రాజధాని అంశంలో గందరగోళాన్ని కొనసాగిస్తోందని పొలిటికల్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తద్వారా టీడీపీ, జనసేన పార్టీలను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తోందని.... వచ్చే ఎన్నికల వరకు ఇదే స్ట్రాటజీతో సాగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.అమరావతే రాజధానిగా ఉండాలని వాదించే వారికి.. గట్టి సమాధానం చెబుతోంది.. వైఎస్సార్సీపీ. 7,500 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సింగపూర్ కన్నా 10 రెట్లు పెద్ద రాజధాని అని చంద్రబాబు గ్రాఫిక్స్ డిజైన్లతో ఆర్భాటం చేశారని.. ప్రభుత్వ కాంప్లెక్స్, శాసనసభ, సెక్రటేరియట్ తప్పిస్తే.. అక్కడ ఎలాంటి ఇతర నిర్మాణాలు చేపట్టలేదని విమర్శిస్తోంది. అమరావతి రాజధాని కాన్సెప్ట్ ద్వారా చంద్రబాబు సామాజిక వర్గం లబ్ధి పొందిందని... భూముల సేకరణ నుంచి వారికి ప్రయోజనాలు కల్పించే వరకు అన్ని అంశాల్లో "కుల" కోణం ఉందని ఆరోపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా... ఇతర ప్రాంతాల్లో ఈ వాదనను గట్టిగా వినిపిస్తూ... ప్రజల మద్దతు తమవైపే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. చంద్రబాబు చేసిన తప్పు తాము చేయమని... ఒకే దగ్గర కేంద్రీకృతమయ్యే అభివృద్ధికి తాము వ్యతిరేకమని చెబుతూ... దానికి ప్రత్యామ్నాయ ఆలోచనే మూడు రాజధానులు అని చెబుతోంది. తద్వారా ఒకే సమయంలో చంద్రబాబుకి చెక్ పెట్టడంతో పాటు.. మిగతా ప్రాంతాల్లో పూర్తిగా ఫ్యాన్ గాలి వీచేలా అడుగులు వేస్తోంది.ఈ మొత్తం పరిణామాలను చూస్తే... హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అమరావతిలో ఇప్పటికిప్పుడు రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించేందుకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం సిద్ధంగా లేదన్నది స్పష్టం అవుతోంది. అదే సమయంలో... మూడు రాజధానాల విధానంపైనా పూర్తి క్లారిటీ ఇచ్చేందుకు సుముఖంగా లేదని తెలుస్తోంది. ఇదే సమయంలో.. ఉత్తరాంధ్ర, రాయలసీమలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలకు తొలి అడుగులు పడుతున్న సందర్భాన్నీ.. జగన్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోన్నట్లుగా కనిపిస్తోంది. మొత్తంమీద... రాజధాని విషయంలో ఏర్పడిన గందరగోళాన్నే తమకు అనుకూలంగా మలుచుకొని.. దాన్నే వచ్చే ఎన్నికల్లో ప్రధాన ఆయుధంగా ప్రయోగించాలని జగన్ పార్టీ భావిస్తోందని.. ఏపీ రాజకీయాలను దగ్గర నుంచి పరిశీలిస్తున్న నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరి... అంతా అధికార పార్టీ ప్లాన్ ప్రకారమే జరుగుతుందా.. ? లేక జగన్ పార్టీని ధీటుగా ఎదుర్కొనే వ్యూహాలను ప్రతిపక్షాలు సిద్ధం చేస్తాయా ? ఈ రాజకీయ చదరంగంలో ప్రజలు చివరికి ఎవరివైపు నిలుస్తారో చూడాలి.. !

# హైకమాండ్‌కు విజయసాయిరెడ్డి దూరం




విజయవాడ, ఫిబ్రవరి 23, వైఎస్ఆర్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి. పార్టీలో ఒకప్పుడు నెంబర్ టు ఆయన. కానీ ఇప్పుడు ఎక్కడా పెద్దగా కనిపించడం లేదు. గతంలో తన ట్విట్టర్ అకౌంట్‌ను అగ్రెసివ్ గా ఉంచేవారు. తీవ్ర విమర్శలు చేసేవారు. అయితే ఇటీవలి కాలంలో ఆయన వ్యవహారశైలి పూర్తిగా మారిపోయింది. ట్విట్టర్‌లో అసలు ప్రతిపక్షంపై విమర్శలు చేయడం మానేశారు. అదే సమయంలో తెలుగుదేశం పార్టీ నేతలతో కనిపిస్తున్నారు. తారకరత్న ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు.. చనిపోయిన తర్వాత ఆయన వ్యవహారశైలి చాలా మందిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. విజయసాయిరెడ్డిలో ఊహించని మార్పు కనిపిస్తోందని అంటున్నారు. దీనికి కారణం ఏమిటన్నదానిపై విస్తృత చర్చ జరుగుతోంది. తారకరత్న అంత్యక్రియలు పూర్తయ్యే వరకూ రెండు రోజుల పాటు విజయసాయిరెడ్డి భౌతిక కాయం వద్దనే ఉన్నారు. ఎవరు వచ్చినా మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు వచ్చినా మాట్లాడారు. ఆయనతో మాట్లాడేందుకు ప్రత్యేకంగా వెళ్లడం.. కారు వద్దకు వెళ్లి సాగనంపడం.. పక్కన కూర్చుని చాలా సేపు ముచ్చటించడం సంచలనంగా మారింది. నిజానికి అలాంటి సందర్భాల్లో రాజకీయాలు మాట్లాడుకునే అవకాశం లేదు. తారకరత్న కుటుంబానికి ఎలా అండగా ఉండాలన్న అంశంపై మాట్లాడి ఉంటారు. కానీ విజయసాయిరెడ్డి అలా ప్రత్యేక ఆసక్తితో చంద్రబాబుతో ముచ్చటించడానికి ప్రయత్నించడం వైఎస్ఆర్‌సీపీలోనూ చర్చనీయాంశం అవుతోంది.తారకరత్న మరణంపై వైఎస్ఆర్‌సీపీ ఓ ప్రత్యేకమైన స్ట్రాటజీని పెట్టుకుంది. అందులో భాగంగా లక్ష్మి పార్వతి తీవ్ర విమర్శలు చేశారు. ఆ విమర్శలను వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియా ప్రచారం చేసింది. కానీ విజయసాయిరెడ్డి మాత్రం ఆ స్ట్రాటజీని ఫాలో కాలేదు. ఆయన మామూలుగానే స్పందించారు. దీంతో లక్ష్మిపార్వతితో పాటు ఇతర నేతలు చేసిన విమర్శలకు టీడీపీ నేతలు... విజయసాయిరెడ్డి మాటలను కౌంటర్ గా ఇచ్చారు. ఇది వైఎస్ఆర్‌సీపీకి ఇబ్బందికరంగా మారింది. అయితే విజయసాయిరెడ్డి మాత్రం తారకరత్న తన చెల్లెలి అల్లుడు కాబట్టి కుటుంబసభ్యునిగా దగ్గరుండి అన్ని చూసుకున్నారు కానీ.. రాజకీయంగా పట్టించుకోలేదని ఆయన వర్గీయులు అంటున్నారు. అయితే గతంలో విజయసాయిరెడ్డి రాజకీయం చూస్తే.. ఇలాంటి సెంటిమెంట్లు ఆయన పట్టించుకోలేదన్న సంగతిని ఇతరులు గుర్తు చేస్తున్నరు. ఒకప్పుడు వైసీపీలో నెంబర్ టు స్థానంలో ఉన్నారు విజయసాయిరెడ్డి. కానీ తర్వాత ఆ స్థానాన్ని సజ్జల రామకృష్ణారెడ్డి పొందారు. క్రమంగా విజయసాయిరెడ్డి దూరం అయ్యారు. ఆయనకు ఇప్పుడు పార్టీలో కీలకమైన పదవి కూడా ఏదీ లేదు. చాలా ఏళ్ల పాటు సోషల్ మీడియాను చూసుకున్నా.. అది కూడా ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడి చేతికి వెళ్లింది. ఆయన తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ లో కనపించడం కూడా తగ్గిపోయింది. సీఎం జగన్ ఇటీవలి ఢిల్లీ పర్యటనలో ఆయన ఉన్నారు కానీ..సీఎం జగన్ పెద్దగా పట్టించుకున్నట్లుగా కనిపించలేదు. దీంతో విజయసాయిరెడ్డి .. వైఎస్ఆర్‌సీపీ హైకమాండ్‌కు దూరం అవుతున్నారా అన్న అనుమానం ఆ పార్టీలో ప్రారంభమయింది.

# ఇంకా డోలి కష్టాలేనా

విజయనగరం, ఫిబ్రవరి 23, ఏజెన్సీలో గర్భిణీల కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఆస్పత్రికి వెళ్లేందుకు కనీస సదుపాయాలు లేక? డోలీలనే నమ్ముకోవాల్సి వస్తుంది. ఈ ప్రయాణం వారి ప్రాణాల మీదకు కూడా తెలుస్తోంది. అల్లూరి జిల్లా ఏజెన్సీలో డోలీలో ఆస్పత్రికి వెళ్లిన ఓ తల్లి? కడపులోనే బిడ్డను కోల్పోయి కన్నీరుమున్నీరవుతోంది. అల్లూరి జిల్లా హుకుంపేట మండలం పనసబంద గ్రామానికి చెందిన గర్భిణి బానుకు ఈ ఉదయం పురిటి నెప్పులు వచ్చాయి. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో? గ్రామస్తులు, కుటుంబ సభ్యులు డోలీ కట్టి ఆమెను ఆస్పత్రికి తరలించారు. డోలీలో రావడం వల్ల? కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందని వైద్యులు తెలిపారు. డెలివరీ చేసి? ప్రాణం లేని బిడ్డను అప్పగించారు. బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉండి ఉంటే.. తమ బిడ్డ బ్రతికేదని ఆవేదన చెందుతున్నారు.కాగా, ఏపీలోని గిరిజన గ్రామాల్లో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు.. సరైన రహదారి సౌకర్యం లేక ఆసుపత్రికి వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. గర్భిణీ స్త్రీలు ఆసుపత్రికి వెళ్లాలంటే డోలీలే ఇప్పటికీ దిక్కుగా మారాయి.. గిరిజనలపై మాటలతో ప్రేమ చూపించేవారే తప్ప.. వారి బ్రతుకులు మార్చే విధంగా మాత్రం ఆలోచన చేయడం లేదని విమర్శలు ఉన్నాయి.. ఏపీలో ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న గిరిజనులు అరకొరక సౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన గర్భిణీ మహిళలు ఆసుపత్రులకు వెళ్లడానికి ప్రసవవేదన కు మించిన బాధలను భరించాల్సిన పరిస్థితులు ఉన్నాయి..

# వందే భారత్ కు భారీగా ఆదరణ

విజయవాడ, ఫిబ్రవరి 23, సంక్రాంతి కానుకగా.. ఏపీ-తెలంగాణ మధ్య పట్టాలెక్కిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల ఆదరణ పెరుగుతోంది. సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగిస్తున్న ఈ ట్రైన్‌లో.. సగటున 140 శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతోందని అధికారులు వెల్లడించారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 17 వరకు.. 29 ట్రిప్పుల్లో.. సికింద్రాబాద్-విశాఖపట్నం రైల్లో 47వేల 55 మంది.. విశాఖపట్నం-సికింద్రాబాద్ రైల్లో 44వేల 938 మంది ప్రయాణించారు.ఇటు సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో సగటున ఒక ట్రిప్‌లో 1,623 మంది ప్రయాణిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. వీరిలో అత్యధికంగా సికింద్రాబాద్ నుంచి 1,099 మంది, విజయవాడలో 341 మంది, వరంగల్‌లో 76, ఖమ్మంలో 55 మంది ఈ రైలు ఎక్కుతున్నట్టు గుర్తించారు. రాజమండ్రి నుంచి 52 మంది ప్రయాణిస్తున్నారు. విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్‌లో సగటున ఒక ట్రిప్‌లో 1,550 మంది ప్రయాణిస్తున్నారు. అత్యధికంగా విశాఖపట్నంలో 1,049 మంది, విజయవాడలో 297, రాజమండ్రిలో 138, వరంగల్‌లో సగటున 24, ఖమ్మంలో 41 మంది ఈ రైలు ఎక్కుతున్నారని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు చెబుతున్నారు.సికింద్రాబాద్-విశాఖపట్నం రైలు కంటే.. విశాఖపట్నం-సికింద్రాబాద్ రైలులో ప్రయాణికుల రద్దీ కొంత తక్కువగా ఉంటోందని గుర్తించారు. విశాఖపట్నం నుంచి ఈ రైలు తెల్లవారుజామున 5.30 గంటలకే బయల్దేరుతుంది. అంత పొద్దున రైల్వే స్టేషన్‌కు చేరుకోవడం ఇబ్బందిగా ఉన్నవారు.. కాస్త లేటుగా బయల్దేరే రైళ్లను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చేవారు.. ముందురోజు రాత్రే విశాఖ చేరుకొని తెల్లవారుజాము వరకు ఎదురుచూడటం ఇబ్బందిగా మారుతోంది. దీంతో వేరే ట్రైన్లలో వస్తున్నారు. మొత్తానికి తెలుగు రాష్ట్రాల్లో తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల ఆదరణ బాగుంటుందని చెబుతున్నారు.



# ఆత్రేయపురం పూతరేకులకు గుర్తింపు

కాకినాడ, ఫిబ్రవరి 23,ఆత్రేయపురం పూతరేకులు.. వీటిని చూసినా.. వీటి పేరు విన్నా.. వెంటనే నోట్లో నీళ్లూరుతాయి. ఇక కోనసీమ ప్రాంతం వారైతే.. వాటి గురించి చెబుతూ పొంగిపోతారు. అంత ఫేమస్ ఆత్రేయపురం పూతరేకులు. అలాంటి వాటికి తాజాగా అరుదైన గుర్తింపు దక్కబోతోంది. అవును.. భౌగోళిక గుర్తింపు పరిశీలనలో ఆత్రేయపురం పూతరేకులు కూడా ఉన్నాయి. ఒకవేళ భౌగోళిక గుర్తింపు దక్కితే.. ఆత్రేయపురం పూతరేకులకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ పెరగనుంది. కోనసీమ పేరు మారుమోగనుంది.అద్భుతమైన రుచి.. మైమరిపించే మాధుర్యం ఆత్రేయపురం పూతరేకుల సొంతం. తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి చెందిన ఆత్రేయపురం పూతరేకులకు.. వాణిజ్య పరిశ్రమల శాఖ జారీ చేసే భౌగోళిక గుర్తింపు కోసం జరుగుతున్న ప్రయత్నాలు కొలిక్కివచ్చాయి. కోనసీమ జిల్లా ఆత్రేయపురానికి చెందిన సర్ ఆర్థర్ కాటన్ పూతరేకుల సహకార సంఘం ప్రతినిధులు.. వైజాగ్ దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ సహకారంతో జీఐ గుర్తింపు కోసం చేసుకున్న దరఖాస్తుకు సంబంధించి పరిశీలనలు పూర్తయ్యాయి.వాణిజ్య పరిశ్రమల శాఖ ఫిబ్రవరి 13న విడుదల చేసిన జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ జర్నల్‌లో.. ఆత్రేయపురం పూతరేకుల గుర్తింపుపై ప్రకటన ఇచ్చారు. చెన్నై కేంద్రంగా ఉన్న జీఐ రిజిస్ట్రేషన్ కార్యాలయం.. వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన వస్తువులు, కళలు, ఆహార ఉత్పత్తుల గుర్తింపు కోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించి.. ఆ తరువాత అభ్యంతరాల కోసం ప్రకటన జారీ చేస్తుంది. ఎవరి నుంచీ అభ్యంతరాలు రాకుంటే.. జీఐను నమోదు చేస్తుంది. ప్రస్తుతం పూతరేకుల గుర్తింపు అంశం ప్రకటన వరకు వచ్చింది. త్వరలో జీఐ సాధిస్తామని.. సహకార సంఘం ప్రతినిధులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## తిరుపతిలో రామానుజాచార్య జయంతి...

తిరుపతి, ఫిబ్రవరి 23,హిందువుల పుణ్యక్షేత్రం తిరుపతి. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైన ఈ క్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ఆధ్యాత్మిక రాజధాని" అని అంటారు. శ్రీ మహా విష్ణువు స్వయంభుగా అవతరించిన ఎనిమిది క్షేత్రాలలో ఇది ఒకటి. రామానుజాచార్యులు కొండ కింద గోవిందరాజస్వామి ఆలయాన్ని ఏర్పాటు చేయడంతో తిరుపతి చరిత్రకు బీజం పడింది. ఈ చారిత్రక నగరం మరో రెండు రోజుల్లో పుట్టిన రోజుని జరుపుకోనుంది. తిరుపతి నగరం క్రీ.శ.1130లో ఫిబ్రవరి 24న ఆవిర్భవించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఈ నేపథ్యంలో తిరుపతి నగరం ఫిబ్రవరి 24, శుక్రవారం నాడు తన 893వ పుట్టినరోజును జరుపుకోనుంది. 893 సంవత్సరాల క్రితం ఫిబ్రవరి 24వ తేదీన శ్రీ వైష్ణవ సన్యాసి భగవద్ రామానుజాచార్యులు ప్రస్తుతం నగరం నడిబొడ్డున ఉన్న గోవిందరాజ స్వామి ఆలయానికి పునాది వేశారు. ఈ నగరాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చారు. పట్టణ అభివృద్ధికి నాంది పలికారు.తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి గతేడాది ఫిబ్రవరి 20న పురాతన శాసనాలను తెప్పించారు. ఇందులో ఈ నగరానికి 1130 ఫిబ్రవరి 24న రామానుజాచార్యులుశంకుస్థాపన చేసినట్లు రుజువులుదొరికాయి. ఈ ఆధారాలు టీటీడీ ఆధ్వర్యంలోని గోవిందరాజ ఆలయంలో వెలుగులోకి వచ్చాయి.సౌమ్య నామ సంవత్సరం ఉత్తరా నక్షత్ర సోమవరం ఫాల్గుణ పౌర్ణమి నాడు రామానుజులు గోవిందరాజుల పీఠాధిపతిని ప్రతిష్టించి, నిత్య కైంకర్యములు చేసి, నాలుగు మాడ వీధులను అగ్రహారాలతో తిరుపతిని నిర్మించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత దేవాలయం చుట్టూ ఉన్న ఇతర సంఘాలు తిరుపతిగా మారాయి. ఈ క్షేత్రం నేడు భారతదేశంలో హిందువుల ఆరాధనకు చిహ్నంగా మారింది. యు ప్రపంచంలోని అత్యంత ధనిక పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా ఉంది, "అని భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అంతేకాదు.. రామానుజుల రాకకు ముందు తిరుపతి లేదన్నారు. తిరుచానూరులో శ్రీవారి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పండుగల కోసం అనేక ప్రదేశాలు ఉన్నాయి.. కానీ మరే ఇతర నగరంలో కూడా ఆ నగర స్థాపనకు ఖచ్చితమైన తేదీ లేదు, "అని చెప్పారు."తిరుమల ఆలయంలో సమతా ధర్మాన్ని స్థాపించి, పూజా కైంకర్యములను రూపొందించిన భగవద్ రామానుజులు తిరుపతి నగరానికి మూలకర్త. క్రమంగా చుట్టూ అగ్రహారాన్ని నిర్మించి దానికి తన గురువు పేరిట రామానుజపురం అని నామకరణం చేశారు. అందుకే ఇది చాలా కాలం పాటు రామానుజ పురంగా ??గౌరవించబడింది. "ఈ పట్టణాన్ని మొదట గోవిందరాజ పట్టణం అని, తరువాత రామానుజ పురం అని, 13వ శతాబ్దం ప్రారంభం నుండి తిరుపతి అని పిలిచేవారు" అని మ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు. తిరుమలకు ముఖద్వారమైన తిరుపతి లాంటి నగరానికి, శ్రీవేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న పుణ్యక్షేత్రానికి కూడా జన్మదిన వేడుకలు ముఖ్యమన్నారు ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డతిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ గోవిందరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ రామానుజాచార్యుల విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పౌర సంఘం అనేక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ప్లాన్ చేసింది.

## రామసుబ్బారెడ్డికి ఎమ్మెల్సీ పదవీ...

కడప, ఫిబ్రవరి 23,జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే రామసుబ్బారెడ్డికి ఎట్టకేలకు వైసీపీ అధినాయకత్వం ఎమ్మెల్సీగా ఎంపిక చేసింది. అయితే రామసుబ్బారెడ్డికి ఈ పదవి కొత్తేమీ కాదు. టీడీపీ హయాంలోనూ ఆయనను ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. గత ఎన్నికల సందర్భంగా ఆయన పోటీ చేసేందుకు వీలుగా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఆదినారాయణరెడ్డి సోదరుడు శివనాథరెడ్డికి కేటాయించారు. రామసుబ్బారెడ్డి కుటుంబం దశాబ్దాలుగా టీడీపీలోనే కొనసాగింది. ఫ్యాక్షన్ రాజకీయాలను తట్టుకుని నిలబడింది. జమ్మలమడుగులో పార్టీ జెండాను ఎగురవేయడంలో పొన్నపురెడ్డి కుటుంబం ముందుందన్న పేరుంది. 1983 తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నాటి నుంచి పొన్నపురెడ్డి కుటుంబం టీడీపీనే నమ్ముకుంది. అన్ని సార్లు జమ్మలమడుగు టిక్కెట్లు ఆ కుటుంబానికే టీడీపీ అధినాయకత్వం ఇచ్చింది. 1983 నుంచి వరసగా ఆ కుటుంబం జమ్మలమడుగులో గెలుస్తూ వచ్చింది. 1983 నుంచి 1999 వరకూ జరిగిన ఐదు ఎన్నికల్లో ఆ కుటుంబ సభ్యులే గెలిచారు. రామసుబ్బారెడ్డికి మంత్రి పదవిని కూడా టీడీపీ ఇచ్చి గౌరవించింది. 1999 తర్వాత ఆ కుటుంబానికి జమ్మలమడుగులో విజయం లభించలేదు. టిక్కెట్ టీడీపీ ఇస్తున్నా రామసుబ్బారెడ్డి మాత్రం గెలవలేకపోయారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చినా రామసుబ్బారెడ్డి గెలవలేదు. దీంతో ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. అయితే రామసుబ్బారెడ్డి మీద గెలిచిన ఆదినారాయణరెడ్డిని పార్టీలోకి చేర్చుకుని మంత్రి పదవి ఇవ్వడంతో రామసుబ్బారెడ్డి కుటుంబం ఆగ్రహానికి గురైంది. తమ ప్రత్యర్థిని ఎలా తీసుకుంటారంటూ మండిపడింది. అయినా చంద్రబాబు పొన్నపురెడ్డి కుటుంబంపై ఉన్న నమ్మకంతో ఎన్నిసార్లు ఓటమిపాలయినా 2019 ఎన్నికల్లో జమ్మలమడుగు టిక్కెట్ ఇచ్చారు. ఆదినారాయణరెడ్డిని ఎంపీగా పోటీ చేయించారు. దీంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. 2019 ఎన్నికల తర్వాత రామసుబ్బారెడ్డి వైసీపీలో చేరారు. వైసీపీలో చేరినా జమ్మలమడుగులో పార్టీలో ఇబ్బందులు పడుతున్నారు. రామసుబ్బారెడ్డికి, ప్రస్తుత ఎమ్మెల్యే మూలే సుధీర్ రెడ్డికి మధ్య సయోధ్య లేదు. దీంతో అధినాయకత్వం అనేక సార్లు పంచాయతీలు చేసింది. ఈసారి టిక్కెట్ కూడా సుధీర్ రెడ్డికేనని రామసుబ్బారెడ్డికి వైసీపీ స్పష్టం చేసింది. తాజాగా ఎమ్మెల్సీగా ఆయనకు అవకాశమిచ్చింది. వైసీపీలో చేరి రామసుబ్బారెడ్డి ఏం సాధించారని ఆయన అనుచరులే ప్రశ్నిస్తున్నారు. ఇదేదో టీడీపీలో ఉన్నా హుందాగా ఉండేది కదా? అని ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద రామసుబ్బారెడ్డి పార్టీ మారినా ప్రయోజనం లేదని, పెద్దల సభకే పరిమితం కావాల్సి వచ్చిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

## జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ పంపిణీ చేసిన ఎస్.ఎఫ్.ఐ.

గోనెగండ్ల : హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న (పేరెంట్స్ లేని) విద్యార్థులకు ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో ఎగ్జామ్ ప్యాడ్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి హెచ్ ఎం హెచ్‌ఎం అయ్యస్వాములు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వీరన్న, ఖాజ, సలీం, నంది, యుటిఎఫ్ నాయకులు నరసింహ, బాబు, రామన్, జిక్రియ, బతకన్న, రామకృష్ణ, మరియు వీరాంజిని, ఉదయ్, సిరాజ్, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కన్నా బాటలో మరో 200 మంది నేతలు

## రంగంలోకి దిగిన అధిష్టానం

విజయవాడ, ఫిబ్రవరి 24,ఏపీ బీజేపీలో తిరుగుబాటు జరుగుతోందా? క్రమశిక్షణకు కేరాఫ్ అడ్రస్ గా చెప్పుకునే ఆ పార్టీ ఏపీలో ముక్క చెక్కలవ్వడానికి సిద్ధంగా ఉందా? అంటే పరిశీలకులు ఔననే అంటున్నారు. ఏపీలో రాజకీయంగా బలోపేతం అన్న సాకుతో పార్టీ అధిష్ఠానం అమలు చేసిన వ్యూహాలు, ఎత్తుగడలు పూర్తిగా వికటించాయని అంటున్నారు.రాష్ట్రంలో కులాల చీలకతో సులభంగా బలోపేతం అవ్వవచ్చున్న అంచనాతో జగన్ సర్కార్ తో అంటకాగిన ఫలితమే.. ఏపీ బీజేపీలో ముసలానికి కారణమైందని విశ్లేషిస్తున్నారు. ఏపీ బీజేపీ పట్ల ఆ పార్టీ అధినాయకత్వం వ్యవహరించిన తీరే రాష్ట్ర నాయకత్వానికీ, క్యాడర్ కూ మధ్య అగాధానికి కారణమైందంటున్నారు. ఏపీ బీజేపీలో సంక్షోభానికీ, అసంతృప్తికీ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజును అడ్డగోలుగా సమర్ధించిన జాతీయ నాయకత్వ తీరే కారణమని పార్టీ శ్రేణులే విమర్శిస్తున్నాయి. కేంద్ర నాయకత్వం తీరు కారణంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యవర్గ సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ పార్టీకి రాజీనామా చేశారంటున్నారు. అక్కడితో రాజీనామాల పర్వం అగే పరిస్థితి కనిపించడం లేదని కూడా అంటున్నారు.కన్నా బాటలోనే మరికొందరు కూడా ఉన్నారని చెబుతున్నారు. కన్నా పార్టీ కార్యకర్తలతో సమావేశమయి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించడానికి ముందే, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా రంగంలోకి దిగి బుజ్జగించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడు రాష్ట్ర పార్టీలో తిరుగుబాటు జెండా ఎగురవేయడానికి సిద్ధమై విజయవాడలో సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి రెడీ అయిన నేతలను పార్టీ జాతీయ స్థాయి నాయకుడు శివప్రకాష్‌జీ వారించారు. ఈ నెల 26న తాను విజయవాడకు వచ్చి సమస్యలన్నీ పరిష్కరిస్తానని చెప్పడంతో బీజేపీలో రాజీనామాల పర్వానికి పడిన తెర తాత్కాలికమేనని పార్టీ శ్రేణులే అంటున్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సోము వీర్రాజును కొనసాగిస్తే, తాము పార్టీకి రాజీనామా చేస్తామంటూ దాదాపు 200 మంది రాష్ట్ర-జిల్లా స్థాయి నేతలు విజయవాడ కేంద్రంగా ఓ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఆ సమాచారం తెలిసి పార్టీ అధినాయకత్వం వారించింది. గతంలో కూడా రెండు సార్లు పార్టీలో అసమ్మతి నేతలు సమావేశం ఏర్పాటుకు ప్రయత్నించిన సందర్భాలలో కూడా కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకుని వారించింది. ఇప్పుడు ఇది మూడోసారి. ఈసారి శివప్రకాష్‌జీ సమక్షంలో తాడో పేడో తేల్చుకోవాలన్న పట్టుదలతో రాష్ట్ర బీజేపీ అసమ్మతి నేతలు ఉన్నారు. బుజ్జగించి సమస్య పరిష్కారాన్ని వాయిదా వేసేందుకు ప్రయత్నిస్తే మాత్రం ఈ సారి వెనక్కు తగ్గేదే లే అంటున్నారు. ఏపీలో పార్టీని ఏం చేద్దామనుకుంటున్నారు? వైసీపీ విషయంలో పార్టీ అధిష్ఠానం వైఖరి ఏమిటి? సోము వీర్రాజును ఏపీ పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి ఎందుకు తప్పించరు? అని శివప్రకాష్ జీని నిలదీయాలని నిర్ణయించుకున్నట్లు అసమ్మతి నేతలు చెబుతున్నారు. కన్నా లక్ష్మీనారాయణ వ్యవహారంలో పార్టీ హైకమాండ్ వ్యవహరించిన తీరు ఏపీలో బీజేపీలో తొలి నుంచీ పని చేస్తున్న వారిలో కూడా అసంతృప్తి వ్యక్తం అవుతోందని చెబుతున్నారు. బీజేపీ వ్యవస్థాపక కాలం నుంచి పనిచేస్తున్న వారిలో సైతం ఏపీ బీజేపీలో కొనసాగితే రాజకీయ భవిష్యత్ భూ స్థాపితం అయిపోతుందన్న భావనే వ్యక్తమౌతోందని అసమ్మతి నేతలు చెబుతున్నారు. ప్రధానంగా జనసేన, తెలుగుదేశం పార్టీల పొత్తుకు మద్దతు విషయంలో పార్టీ అనుసరిస్తున్న వైఖరి పట్ల వారు అసమ్మతి తెలియజేస్తున్నారు. 35 మంది రాష్ట్ర-జిల్లా స్థాయి నేతలు, రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుకు వ్యతిరేకంగా ఇప్పటికే సంతకాల సేకరణ చేసినట్లు పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. సోము వీర్రాజును అధ్యక్షుడిగా కొనసాగించాలని భావిస్తే, తాము ఆయనతో పనిచేయడం కష్టమని ఇప్పటికే పార్టీ అధినాయకత్వానికి స్పష్టం చేశారంటున్నారు. అలాగే రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ పట్ల పార్టీ అధినాయకత్వం వైఖరి ఏమిటన్నది స్పష్టం చేయాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు.

# నెల్లూరు వైసీపీలో ముసలం



నెల్లూరు, ఫిబ్రవరి 23, ఏపీలో ఎన్నికలకు మరో ఏడాదిన్నర సమయం ఉంది. ఇప్పటి నుంచే రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీలో అసంతృప్తి గళాలు కలవరపెడుతున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సొంత పార్టీ ఎమ్మెల్యేలు తిరుగుబావుటా ఎగరేశారు. తాజాగా ప్రకాశం జిల్లాలోని మరో నియోజకవర్గంలో ధిక్కార స్వరం వినిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ఇంఛార్జ్‌పై సొంత పార్టీ నేతలు, కార్యకర్తలు భగ్గుమంటున్నారు. ఏకంగా టీడీపీకి కోవర్ట్ అంటూ ముద్ర వేశారు.కొండేపి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇంఛార్జ్ వరికూటి అశోక్‌బాబు సొంత పార్టీని నాశనం చేస్తున్నారని అసమ్మతి నేతలు మండిపడ్డారు. అనుచరులతో కలిసి ఇసుక, మద్యం, బియ్యం అక్రమ వ్యాపారాలు చేయిస్తూ దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అశోక్‌బాబు టీడీపీకి కోవర్టుగా పని చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బొట్ల రామారావు విమర్శించారు. ఇప్పుడు నిజమైన నేతల్ని, పార్టీ కార్యకర్తల్ని పక్కకు నెట్టి తన మనుషులను ఏజెంట్లుగా పెట్టి అన్ని మండలాల్లో మాఫియా నడుపుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.ఇసుక, మద్యం, బియ్యం వ్యాపారాలు చేయిస్తూ మామూళ్లు దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. త్వరలోనే ఇంఛార్జ్ బాధ్యతల నుంచి ఆయన్ను అధిష్ఠానం తప్పిస్తుందన్నారు. అలా జరగని పక్షంలో మార్చి నెలాఖరున నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి అశోక్‌బాబు బాధితులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు తాడేపల్లి వరకు పాదయాత్రగా వెళ్లి ఇంఛార్జిని మార్చాలని ఒత్తిడి తెస్తామన్నారు.టీడీపీ కోవర్టుగా పనిచేస్తున్న అశోక్‌బాబును నియోజకవర్గంలో లేకుండా తరిమికొడతామన్నారు కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డపాటి అరుణ. పార్టీ కార్యక్రమాలు తనకు తెలియకుండా మండలంలో నిర్వహిస్తున్నారని జరుగుమల్లి జెడ్పీటీసీ సభ్యురాలు చంద్రలీల ఆరోపించారు. కుటుంబ విషయాల్లో అశోక్‌బాబు జోక్యం చేసుకుంటూ తనను ఇబ్బంది పెడుతున్నారని మరో నేత ఆరోపించారు.2019 ఎన్నికల్లో పార్టీకి వెన్నుపోటు పొడిచి ఎమ్మెల్యే స్వామి గెలుపునకు కృషి చేసింది అశోక్ బాబు కాదా అని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో పార్టీ అధిష్టానాన్ని బ్లాక్‌మెయిల్ చేయలేదా అన్నారు. టీడీపీ వారి దగ్గర డబ్బులు తీసుకోలేదా.. డబ్బులు తాకే అలవాటు ఆయనకు ఉంది కాని తమకు లేదన్నారు. తాము పార్టీ కోసం కష్టపడుతున్నామని.. మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేయడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. 'అశోక్ బాబు నువ్వు నీ ఆరోపణలకు కట్టుబడి ఉంటే ఏ గుడిలోనైనా లేదా వైఎస్ఆర్ విగ్రహం వద్ద అయినా ప్రమాణం చేయడానికి మేము రెడీ నువ్వు రెడీయా' అంటూ సవాల్ చేశారు.ఇటీవల కొండేపిలో టీడీపీ ఎమ్మెల్యే స్వామి నిరసన కార్యక్రమం చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సందర్భంలో సీఎం జగన్‌ను విమర్శించారని.. అందుకు ప్రతిగా అశోక్‌బాబు ఖండిస్తారని తామంతా ఎదురు చూశామని.. కానీ అలా చేయలేదన్నారు. ఆ తర్వాత జరిగిన గృహసారథుల సమావేశంలో తమను టీడీపీ కోవర్టులని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మొత్తం మీద కొండేపి నియోజకవర్గ ఇంఛార్జ్ అశోక్‌బాబును సొంత పార్టీ నేతలే టార్గెట్ చేశారు. అంతేకాదు అశోక్‌బాబుపై పల్నాడు జిల్లా జానపాడుకు చెందిన రైతులు కరపత్రాలు విడుదల చేశారు. తమను మోసం చేశారని ఆరోపించారు.

# కెసి కెనాల్ ను కాపాడుకునేందుకు అప్పర్ భద్రప్రాజెక్టును అడ్డుకుందాం....

## కృష్ణానదిపై తీగల వంతెన బదులు బ్యారేజ్ కం బ్రిడ్జి కోసం పోరాడుదాం...

నంద్యాల ఫిబ్రవరి 23 కర్నూలు - కడప కాలువ ఆయకట్టును కాపాడుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం చేపట్టే ఎగువభద్ర ప్రాజెక్టును అడ్డుకుందామని, కరువు, వలసలకు నిలయమై అన్ని రంగాల్లో వెనుకబడ్డ రాయలసీమకు గుక్కెడు నీరు కూడా లేకుండా చేసేందుకు కర్ణాటక అప్పర్ భద్ర ప్రాజెక్టును చేపట్టిందని, ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. అలాగే నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం వద్ద కృష్ణా నదిపై తీగల వంతెన బదులు బ్యారేజ్ కం బ్రిడ్జి నిర్మాణం కోసం , అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు యం. వి. రమణారెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రమైన బండి ఆత్మకూరు శ్రీ లక్ష్మి జనార్ధన స్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు యం. వి. రమణారెడ్డి మాట్లాడుతూ చలో ఆదోనిని విజయవంతం చేయాలని, కర్నూలు - కడప కాలువ, హెచ్ ఎల్ సి, ఎల్ ఎల్ సి, ఆర్ డి ఎస్ ఆయకట్టుకు ఇప్పటికే సక్రమంగా సాగునీరు అందడం లేదని, ఈ రైతులపై మూలిగే నక్కపై తాటికాయ పడ్డ సామెతలా కర్ణాటక ప్రభుత్వం ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపడుతూ రాయలసీమను ఎడారిగా మార్చేందుకు చేస్తున్న కుట్రలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అడ్డుకుని, కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని, సుప్రీంకోర్టును ఆశ్రాయించి అప్పర్ భద్ర అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఎం పి లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు ఇతర ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా అటు పార్లమెంట్ లో ఇటు అసెంబ్లీలో అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకునేలా గళం విప్పాలని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమాన్ని ఉదృతం చేసి అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకుందాం అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై చర్చ జరిపి కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని, అలాగే ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సిద్దేశ్వరం వద్ద కృష్ణా నదిపై ఐ కానిక్ ( తీగల ) వంతెన వల్ల రాయలసీమకు ఎలాంటి ఉపయోగం లేదని, తీగల వంతెన బదులు బ్యారేజ్ కం వంతెన నిర్మిస్తే సంఘమేశ్వరం శ్రీశైలం బ్యాక్ వాటర్ లో సుమారు 70 టీఎంసీ నిల్వచేసి రాయలసీమ ప్రాజెక్టు లకు అందించి కరువు, వలసల నివారణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకత్వం లో రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25 వ తేదిన ఆర్ డి ఎస్ నుండి 28 వ తేది ఆదోని వరకు మహా పాదయాత్ర, ఆదోనిలో 28 న ప్రజా ప్రదర్శనను విజయవంతం చేద్దామన్నారు. ఈ సమావేశంలో బండి ఆత్మకూరు గ్రామపెద్దలు అంకిరెడ్డి, నారాయణ, అశోక్ రెడ్డి, రామిరెడ్డి, జమాల్, తిమ్మారెడ్డి, కృష్ణారెడ్డి, బోయ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిదంగా ఏ. కోడూరు, పార్నపల్లె గ్రామాల్లో రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు చలో ఆదోనిని విజయవంతం చేయాలని ప్రచారం చేశారు.

## కోతి స్వైర విహారం, 8 మందికి తీవ్ర గాయాలు

తణుకు :తణుకు మండలం మండపాక గ్రామంలో కోతి స్వైర విహారం చేస్తూ రెండ్రోజులుగా పలువురిపై దాడికి పాల్పడుతోంది. గురువారం ఉదయం నలుగురు వ్యక్తులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కోతి బుధవారం సైతం నలుగురిపై దాడికి పాల్పడింది. బాధితులు తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## గంజాయి స్వాధీనం

ఏలూరు : పెదపాడు మండలం కలపర్రు టోల్ గెట్ వద్ద 74 లక్షల విలువ చేసే అక్రమ గంజాయివి పట్టుకున్నట్లు జిల్లాఎస్పీ రాహుల్ దేవ్ శర్మ తెలిపారు.. ఏలూరు జిల్లా పోలీస్ కార్యా లయంలో అయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ ఏజన్సీ నుంచి తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 735 కిలోల గంజాయిని కలపర్రు టోల్ గెట్ వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడినట్లు ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ తెలిపారు.. ఈ ఘటనలో ఒకరిని అదుపులోకి తీసుకుని,గంజాయి తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.. అక్రమ గంజాయి ముఠాకి చెందిన మరి కొంతమంది కోసం గాలింపు చర్యలు చేపట్టి నట్లు ఎస్పీ తెలిపారు...

## ఇంతటి శ్రద్ధ రాష్ట్ర సమస్యల పరిష్కారంలో చూపిస్తే బాగుండేది!

ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీకి ఏమీ తోచడం లేదు.పెద్దగా పని ఉండడం లేదు. అప్పుడప్పుడూ గుడులనో, గోపురాలనో హడావుడి చేస్తేనన్నా పార్టీ ఉనికి నిలబడుతుందని అనుకున్నారేమో తెలియదు కానీ, తాజాగా ఒక కారికేచర్ ఆధారంగా వైఎస్ ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపైన విమర్శలు కురిపించి నిరసనలకు దిగారు.ఒకప్పుడు మానవ సేవే మాధవ సేవ అనేవారు. కాని ఏపీలో బీజేపీ ఆ నానుడిని మార్చివేసినట్లుగా ఉంది. పసిపిల్లవాడికి శివరాత్రి నాడు ముఖ్యమంత్రి జగన్ పాలుపడుతున్నట్లుగా ఒక కారికేచర్ వచ్చింది. దానిని వైసీపీ అధికారిక ట్విటర్ లో పోస్టు చేశారట. అందులో ఏదో పెద్ద తప్పు ఉన్నట్లు బీజేపీ నేతలు కనిపెట్టేశారు.కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా వారు నిరసనలు, ధర్నాలు అంటూ రంగంలోకి దిగారు. ఇక ప్రకటనల ఊదర ఎటూ ఉంటుంది. దానిపై వైసీపీ ఎమ్మెల్యేలు , మంత్రులు సీరియస్ గా స్పందించారు. నిజానికి బీజేపీ వారి చేష్టలపై అసలు స్పందించకపోయినా పెద్దగా పోయేదేమీ లేదు. కాని మతపరమైన అంశంగా బీజేపీ చిత్రీకరిస్తున్న నేపధ్యంలో ఈ వ్యవహారం సున్నితంగా ఉంటుంది కనుక వైసీపీ నేతలు దానిపై మాట్లాడినట్లు ఉన్నారు. ఆ కారికేచర్ గమనించినవారికి ఎవరికైనా ముందుగా వచ్చే ప్రశ్న అందులో ఏమి తప్పు ఉందని! ఇందులో హిందువుల మనోభావాలు ఎలా దెబ్బతింటాయని! బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, పార్టీ ఇన్ చార్జీ సునీల్ ధియోదర్, రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నరసింహారావు తదితర ముఖ్యనేతలతో పాటు చిన్నా,చితక నేతలు కూడా దీనిపై ప్రచారం చేపట్టారు.ఈ ప్రభుత్వం ఏకంగా హిందూ వ్యతిరేక ప్రభుత్వమని వారు తేల్చేశారు. అదెలాగంటే పసిపిల్లవాడికి పాలు పట్టడమట. ఇంతకన్నా విడ్డూరం ఏమైనా ఉంటుందా? చిన్నారి బాలుడికి పాలు పడితే శివుడికి క్షీరాభిషేకం చేయడాన్ని అపహాస్యం చేసినట్లయిందని వారు ఆరోపిస్తున్నారు. హిందువులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని వారు విమర్శించారు. ఏదో ఈనాడు, తదితర టీడీపీ మీడియా ప్రచార సంస్థల ద్వారా ప్రచారం పొందడానికి తప్ప బీజేపీ నేతల చర్య ఎందుకన్నా ఉపయోగం ఉంటుందా?ఈనాడు కూడా అసలు ఆ ఫోటోలో ఏముందో రాయకుండా శివలింగానికి క్షీరాభిషేకాన్ని అవహేళన చేసేలా ఫోటో ఉందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారని మాత్రమే పేర్కొనడం గమనించదగిన అంశం.ఆ ఫోటోను సవివరంగా ప్రచురిస్తే అసలు విషయం బయటపడిపోయి,ప్రజలకు వాస్తవం తెలిసిపోతుందన్నది ఈనాడు భయం కావచ్చు. సరే!వారి బాద వారిది! ఎక్కడ ఎవరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినా మహా ప్రసాదంగా ఈనాడు భావిస్తోంది . అది వేరే సంగతి.సోము వీర్రాజు ఆద్వర్యంలో ఏకంగా మార్కాపురం, గిద్దలూరులలో ధర్నాలు కూడా చేసేశారు. ఆయనేదో అక్కడకు టూర్ కు వెళ్లినట్లున్నారు. ఏదో ఒకటి చేస్తే పోలా అని చేసినట్లుంది తప్ప ఏ మాత్రం ఇందులో అర్ధం లేదు.ఏపీలో మతపరమైన వైరుధ్యాలు క్రియేట్ చేయడానికి గతంలోను బీజేపీతో పాటు జనసేన, టీడీపీలు ప్రయత్నాలు చేయకపోలేదు. గుడులలో చోరీలు జరిగాయనో, విగ్రహాలను పాడు చేశారనో , ఏవో సాకులతో అలజడి సృష్టించడానికి కృషి చేశారు. కాని అవేవి ఫలించలేదు.

## పోలీసులకు రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు

### హోం మంత్రి తానేటి వనిత

కాణిపాకం, న్యూస్‌టుడే: చేసిన దాడిని కప్పిపుచ్చుకోవడానికే ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు.చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని బుధవారం ఆమె దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ... 'పోలీసులు ప్రభుత్వ ఉద్యోగులు. వారి విధులను వారు నిర్వర్తిస్తున్నారు.ఎక్కడా ఏ తప్పు, పొరపాటు జరగకుండా చూస్తున్నారు. ఎవరిపైనా కక్ష సాధించాల్సిన అవసరం, రాజకీయం చేయాల్సిన అవసరం వారికి లేదు. తెదేపా హయాంలో పనిచేసిన పోలీసులే ప్రస్తుత వైకాపా ప్రభుత్వంలో పని చేస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రతిపక్ష నాయకుడిని ఎవరూ కొట్టలేదు.కోర్టు ఆదేశాల మేరకు తెదేపా నేత పట్టాభిని ఆసుపత్రికి పంపి చికిత్స అందించాం. ఆయనకు ఎలాంటి దెబ్బలు లేవని, చేయి బెణికిందని వైద్యులు ధ్రువీకరించారు. ప్రతిపక్ష నాయకులు చెప్పేది అబద్ధమని తెలుస్తోంది. ప్రజల్లో వారికి సానుభూతి లేకపోవడంతోనే మీడియా ద్వారా పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నారు. శాసనమండలిని రద్దు చేయాలని సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని కేంద్రానికి తెలిపాం. వారు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రస్తుత పరిస్థితుల్లో మండలిలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తున్నాం' అని వివరించారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బాబు పాల్గొన్నారు.



## విజయ పాల డైరీ కార్మికులను విధుల్లోకి తీసుకునేంతవరకు పోరాటం కొనసాగిస్తాం--సీఐటీయూ

నంద్యాల :-విజయ పాల డైరీ కార్మికులను విధుల్లోకి తీసుకునేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి. మద్దులు, గౌస్ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వేన్న. బాలవెంకట్ డి. లక్ష్మణ్.సీఐటీయూ జిల్లా నాయకులు డి. రత్నమయ్య లన్నారు ఈరోజు గురువారం విజయ పాల డైరీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయం ముందు జరుగుతున్న మూడవ రోజు రిలే నిరాహార దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టీ. మద్దులు గారు ప్రారంభిస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలల నుండి అనేక రూపాల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న జిల్లా లేబర్ అధికారులు, జిల్లా అధికారులు కల్లు ఉండి గుడ్డివాళ్లు లాగా నటిస్తున్నారని, లేబర్ అధికారులు, అధికారులు నిజాయితీగా పని చేయలేకపోతే రాజీనామా చేసి వెళ్లిపోవాలని తెలియజేశారు, అలాగే విజయ పాల డైరీ లో కార్మిక చట్టాలు అమలు చేయకుండా ఉంటే ఎందుకు చూసిచూనట్లు ఉన్నారో ఈ అధికారులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారుగత నాలుగు నెలల నుండి 9 మంది దళిత కార్మికులను అకారణంగా వారి ఉద్యోగాలు తీసివేస్తే కార్మికులకు అండగా ఉండవలసిన లేబర్ అధికారులు, జిల్లా అధికారులు విజయ పాల డైరీ యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ కార్మికుల బ్రతుకులతో చెలగాటమాడుతున్నారని ఇప్పటికైనా విజయ పాల డైరీ యాజమాన్యం మొండి వైఖరి వెంటనే విడనాడి కార్మికులను వెంటనే విడుదల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు, యూనియన్ పెట్టుకున్నారనే నెపంతో విజయ పాల డైరీ లో జరుగుతున్న అరాచకాలను బయట పెడతారనే వారిని ఉద్యోగాల నుంచి తీసివేసి వారి కుటుంబాలను రోడ్డుపాలు చేశారని, వారి కుటుంబ అర్ధనాదాలు మీకు వినబడటం లేదా అని ప్రశ్నించారు మీ ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి చెప్పులు అరిగిపోయే తప్ప వారిని ఉద్యోగాల్లోకి తీసుకోకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్న విజయ పాల డైరీ యాజమాన్య మొండి వైఖరి విడనాడి కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే సిఐటియు ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కలిసొచ్చే అన్నీ పార్టీలను, కార్మిక సంఘాలను ప్రజా సంఘాలను, పాడి రైతులను, కలుపుకొని పెద్ద ఎత్తున ప్రత్యక్ష ఆందోళన పోరాటాలు విజయ పాల డైరీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టవలసి వస్తుందని వారు హెచ్చరించారు అందుకు విజయ పాల డైరీ యాజమాన్యం, జిల్లా లేబర్ అధికారులు, జిల్లా అధికారులు బాధ్యత వహించాలని వారు అన్నారు ఈ మూడవ రోజుదీక్షలకు మద్దతుగా జిల్లా నాయకులు రాజేష్, సుబ్బరాయుడు, రాజు, ఏసన్న పాటు విజయ పాల డైరీ కార్మికులు బాలసుబ్బయ్య, ప్రసాదు, శేఖర్, ఇసాక్, సుబ్బరాయుడు, కరుణాకర్ లు నిరాహార దీక్షలో కూర్చున్నారు



# కెసి కెనాల్ ను కాపాడుకునేందుకు అప్పర్ భద్రప్రాజెక్టును అడ్డుకుందాం



-- నంద్యాల -కర్నూలు - కడప కాలువ ఆయకట్టును కాపాడుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం చేపట్టే ఎగువభద్ర ప్రాజెక్టును అడ్డుకుందామని, కరువు, వలసలకు నిలయమై అన్ని రంగాల్లో వెనుకబడ్డ రాయలసీమకు గుక్కెడు నీరు కూడా లేకుండా చేసేందుకు కర్ణాటక అప్పర్ భద్ర ప్రాజెక్టును చేపట్టిందని, ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. అలాగే నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం వద్ద కృష్ణా నదిపై తీగల వంతెన బదులు బ్యారేజ్ కం బ్రిడ్జి నిర్మాణం కోసం , అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు యం. వి. రమణారెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రమైన బండి

### -- కృష్ణానదిపై తీగల వంతెన బదులు బ్యారేజ్ కం బ్రిడ్జి కోసం పోరాడుదాం

ఆత్మకూరు శ్రీ లక్ష్మి జనార్ధన స్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు యం. వి. రమణారెడ్డి మాట్లాడుతూ చలో ఆదోనిని విజయవంతం చేయాలని కోరారు , కర్నూలు - కడప కాలువ, హెచ్ ఎల్ సి, ఎల్ ఎల్ సి, ఆర్ డి ఎస్ ఆయకట్టుకు ఇప్పటికే సక్రమంగా సాగునీరు అందడం లేదని, ఈ రైతులపై మూలిగే నక్కపై తాటికాయ పడ్డ సామెతలా కర్ణాటక ప్రభుత్వం ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపడుతూ రాయలసీమను ఎడారిగా మార్చేందుకు చేస్తున్న కుట్రలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అడ్డుకుని, కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని, సుప్రీంకోర్టును ఆశ్రాయించి అప్పర్ భద్ర అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బండి ఆత్మకూరు గ్రామపెద్దలు అంకిరెడ్డి, నారాయణ, అశోక్ రెడ్డి, రామిరెడ్డి, జమాల్, తిమ్మారెడ్డి, కృష్ణారెడ్డి, బోయ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిదంగా ఏ. కోడూరు, పార్నపల్లె గ్రామాల్లో రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు చలో ఆదోనిని విజయవంతం చేయాలని ప్రచారం చేశారు.

# అవినీతి అక్రమాలకు అడ్డాగా బద్వేల్ ఫారెస్ట్ రేంజ్

### లక్షల రూపాయలు దండుకుంటూ అనుమతులు లేని బొగ్గు లారీలను వదిలేస్తున్న అధికారులు
### గతంలో ఒక ఫాస్ట్ రేంజర్ రెండు బొగ్గు లారీలకు 10 లక్షల పైగా దండుకున్న వైనం

బద్వేలు ,బద్వేల్ పాస్ట్ రేంజ్ కార్యాలయం అవినీతి అక్రమాలకు అడ్డాగా మారింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు తుట్లు పొడిచే విధంగా అధికారులు కొంతమంది సిబ్బంది వ్యవహరిస్తున్నారు మొదటినుంచి బద్వేల్ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం పైఅనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి ఆరోపణలకు తగ్గట్టుగానే ఇక్కడి పరిస్థితులు ఉన్నాయి ఇటీవల జరిగిన ఒక సంఘటన ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అప్పటి ఫారెస్ట్ రేంజర్ అక్రమంగా తరలిపోతున్న రెండు బొగ్గులార్ నేను పట్టుకొని వాటిని నిబంధన ప్రకారం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించకుండా మరోచోట దాచి ఉంచారు అక్రమంగా బొగ్గు తరలిస్తున్నారని గుర్తించిన అధికారి వారితో భేరసారాలు మాట్లాడారు అప్పటి రేంజర్ ఆదేశాల మేరకు అప్పటి డిఆర్ఓ కొంతమంది సిబ్బంది అక్రమంగా బొగ్గు తరలిస్తున్న వారితో మాట్లాడి భేరసారాలు మొదలుపెట్టారు లారీలు వదిలి పెట్టాలంటే 15 లక్షల రూపాయలు ఇవ్వాలని పట్టుబట్టారు చివరికి 10 లక్షల కు బేరం కుదిరింది పట్టుబడిన లారీల్లో 600 పైగా బొగ్గు బస్తాలు ఉన్నాయి ఒక్కొక్క బస్తాకు 500 రూపాయల నుంచి నాలుగింతలు జరిమానా విధించవలసి ఉంటుందని ఆ లెక్కన 600 బస్తాలకు ఎంత అవుతుందో లెక్కవేసుకోండని అక్రమంగా తరలిస్తున్న బొగ్గు వ్యాపారులకు చెప్పడం జరిగింది ఇవే కాకుండా లారీలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతుంటాయి బ్రహ్మంగారిమఠం బద్వేలు గోపవరం మండలం నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రతిరోజు అక్రమంగా బొగ్గు లారీలు తరలిపోతుంటాయి ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే అంతేకాకుండా అక్రమంగా తరలిపోతున్న బొగ్గు బస్తాల కింద ఎంతో విలువైన ఎర్రచందనం కూడా తరలిస్తుందారని ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి సెటిల్మెంట్ తోనే అక్రమంగా బొగ్గు లారీలు తరలిపోతుంటాయి ఇందులో ఫారెస్ట్ కీలక అధికారులు కొంతమంది సిబ్బంది ఉన్నారనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం నిబంధనలు తుంగలో తొక్కి ఎలాంటి పర్మిట్ లేకుండా బొగ్గు అక్రమంగా తరలిస్తుంటారు నిబంధన ప్రకారం పర్మిట్ తీసుకొని పట్టా భూముల్లో ఉన్న కట్టెలు కాల్చి ఆ తర్వాత వాటిని బొగ్గుగా మార్చి ఆ తరువాతనే రవాణా చేయవలసి ఉంది కానీ ఇవేమీ కొందరు వ్యాపారులు ఏమాత్రం చేయడం లేదు బద్వేలు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో కేవలం ఐదు మంది మాత్రమే బొగ్గు రవాణా చేసేవారు ఉన్నారు వీరిలో బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన వారు ముగ్గురు బి కోడూరు మండలం చెందిన మరో ఇద్దరు ఉన్నారు ఒక్కరిద్దరూ సక్రమంగా వ్యాపారం చేస్తుండగా మరికొందరు అక్రమ మార్గంలో బొగ్గు రవాణా చేస్తున్నారు

## చెరువులలో అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తాం... డిఈఈ చంద్రశేఖర్




తుగ్గలి: ఉదయం న్యూస్:మైనర్ ఇరిగేషన్ చెరువులలో ఎవరైనా అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు,మట్టిని తరలించిన వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేస్తామని పత్తికొండ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.చంద్రశేఖర్ అన్నారు. గురువారం రాంపల్లి చెరువులో మట్టిని తరలిస్తున్నారని సమాచారం అందుకున్న డిఈఈ చంద్రశేఖర్,ఏఈఈ జి.చంద్రశేఖర్ లు చెరువును పరిశీలించారు. ఆ సమయంలో చెరువులో ఎవరూ లేకపోవడంతో చెరువును పరిశీలించి వచ్చారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎవరికైనా చెరువులో మట్టి కావాలి అంటే మైనర్ ఇరిగేషన్ అధికారులకు దరఖాస్తులు చేసుకుంటే మట్టి తరలించేందుకు నిబంధనల ప్రకారం అనుమతిని ఇస్తామని వారు తెలిపారు. అనుమతి లేకుండా బొందిమడుగుల చెరువులో మట్టి తరలిస్తుంటే అక్కడ వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అందువల్ల ఎవరైనా చెరువుల్లో అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే కేసులు పెడతామని వారు హెచ్చరించారు.

### ఆరోగ్య రిత్యా పూజ కార్యక్రమానికి పీట మీద కూర్చుంటే తప్పా

నంద్యాల :-. ప్రపంచంలో పరమేశ్వరుడు ఒక్కరే అది శ్రీకాళహస్తి అయినా మహనంది అయినా ఒక్కటే . శ్రీ కాళహస్తి లో ఒకరూలు మహనంది లో ఒకరూలు ఉండదని పలువురు భక్తులు అంటున్నారు . మహనంది లో ఉన్న అర్చకులు తెలిసి చేస్తారో తెలియక చేస్తారో అర్థం కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు . గత కొన్ని సంవత్సరాలుగా మహనంది దేవస్థానం కు భక్తులకు అన్నదానం కు సరిపడు నిత్యం కూరగాయలు అందిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్న మార్కెట్ ప్రసాద్ అలాంటి వ్యక్తి కుటుంబాన్ని అవమాన పరిచే విధంగా రాఘవ శర్మ అనే అర్చకుడు పీట తీయించడం చాలా బాదకరమని భక్తులు భావిస్తున్నారు. రాఘవ శర్మ ఎవరి మాటలు విని చేయించారా లేక ఆయన స్వంత తెలివితేటలతో తీయించారా అనేది అర్థం కావడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు . వివరాల్లోకి వెళ్తే :- మహనంది దేవస్థానం లో మహా శివరాత్రి పర్వదినం రోజు రాత్రి లింగోర్భవం జరిగినది ఆ లింగోర్భవం కు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం దాతలు అయిన మార్కెట్ ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు .

# పవన్ రెండవసారి దేవుడి అవతారం!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్..సాయి ధరమ్ హీరోలాగా తమిళ్ సినిమా 'వినోదయ సిద్దమ్' తెలుగులో రీమేక్ అవుతోన్న సంగతి తెలిసిందే. నిన్నటి రోజున సినిమా లాంచింగ్ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో పీకే సహ ప్రాజెక్ట్ లో కీలక నటులుంతా పాల్గొన్నారు. ఇందులో పీకే దేవుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. దీంతో పవన్ పాత్ర నిడివి తక్కువగా ఉండే అవకాశం ఉంది. కొన్ని కీలకమైన సన్నివేశాల్లో అలా వచ్చి వెళ్లిపోయే అవకాశం ఉంది. ఈ సినిమా చేయడం కూడా మేనల్లుడి కోసమే చేస్తున్నట్లు ఓవైపు ప్రచారం సాగుతోంది. అవన్ని పక్కనబెడితే పవన్ దేవుడి పాత్ర పోషించడం మాత్రం ఇది రెండవ సారి ఇంతకు ముందు 'గోపాల గోపాల' సినిమాలో శ్రీకృష్ణుడి పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. హీరోగా విక్టరీ వెంకటేష్ నటించిన చిత్రమిది. బాలీవుడ్ సినిమా 'ఓ మైగాడ్' కి రీమేక్ రూపం. అయితే ఆసినిమాలో దేవుడి పాత్ర మరీ అంత గొప్పగా పండింది కాదు. పవన్ ఇమేజ్ ని ఎన్ క్యాష్చేసుకునే ప్రయత్నం తప్ప పాత్రలో పస లేదు. ఆ సినిమా కూడా యావరేజ్ గా ఆడింది. ఆ రకంగా కృష్ణుడి పాత్రతో పవన్ మార్క్ అయితే పెద్దగా కనిపించలేదు. తాజాగా మరోసారి వినోదయ్య సిద్దమ్ లో అలాంటి ప్రయత్నమే చేస్తున్నాడా? లేక దేవుడి పాత్రనే ఓ వండర్ గా మలుస్తున్నారా? అన్నది చూడాలి. ఇప్పటివరకూ ఈ సినిమాలో సాయితేజ్ని హైలైట్ చేసే ప్రయత్నం కనిపించింది తప్ప! పవన్ మాస్ ఇమేజ్ ని సినిమా పరంగా జనాల్లోకి ఇంకా అంతగా బలంగా తీసుకెళ్లలేదు. అయితే ఈ సినిమాకి కర్త..కర్మ..క్రియలా దర్శకుడు త్రివిక్రమ్ వ్యవహరిస్తున్నాడు. కాబట్టి పవన్ పాత్రని బలంగా మార్చడానికి అవకాశం ఉంది. 'గోపాల గోపాల'కి వేర్వేరు రచయితలు పనిచేయడం తో మాతృకని పెద్దగా మార్చలేదు. అలాగే పవన్ పాత్రని వారంతా సీరియస్ గా తీసుకున్నట్లు కనిపించలేదు. మరి ఈసారి పీకే పాత్ర ఎలా ఉంటుందన్నది చూడాలి. పవన్ ని అభిమానులు దేవుడిగా ఆరాదిస్తుంటారు. మా దేవుడు మా దేవుడు అంటూ ఎప్పటికప్పుడు రచ్చ చేస్తుంటారు. మరి వాళ్ల అభిమానాన్ని దృష్టిలో పెట్టుకుని గురూజీ నిజంగానే దేవుడి అంతటి వాడ్ని చేసేస్తాడా? అన్నది చూడాలి.

# ఇలా అయితే పాన్ ఇండియా కష్టం గురూజీ!

తెలుగులో టాప్ డైరెక్టర్ గా త్రివిక్రమ్ కి మంచి పేరు ఉంది. ఆయన చేస్తున్న సినిమాలు కూడా టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తున్నాయి. ఇప్పటివరకు నాన్ బాహుబలి రికార్డు కొట్టిన సినిమా ఏదైనా ఉంది అంటే అది త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కి విడుదలైన అలవైకుంఠపురం సినిమా. కొన్ని



ఏరియాలలో ఆ సినిమా రికార్డులను వాల్తేరు వీరయ్య బద్దలు కొడుతుందని అంటున్నారు. కానీ దానికి ప్రామాణికాలు లేవు. అంటే ఒక రకంగా తెలుగులో టాప్ డైరెక్టర్ల లిస్టులో త్రివిక్రమ్ రాజమౌళి తర్వాత ప్లేస్ లో ఉన్నాడు అనుకుందాం. కానీ రాజమౌళి లాగా ఆ తర్వాత సుకుమార్ లాగా దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకునే ప్రయత్నం మాత్రం త్రివిక్రమ్ చేయడం లేదనే కంటే వర్క్ అవుట్ అవ్వడం లేదని చెప్పాలి. ఇప్పటివరకు త్రివిక్రమ్ నేరుగా పాన్ ఇండియా సినిమాలు చేయలేదు. కానీ ఆయన డైరెక్ట్ చేసిన చాలా సినిమాలు ఇతర భాషల్లో రీమేక్ అయ్యాయి. కానీ ఒక్కటంటే ఒక్క సినిమా కూడా ఆ రీమేక్ అయిన భాషలో నిలబడలేకపోయింది. ముందుగా ఆయన రచయితగా చేసిన 'నువ్వు నాకు నచ్చావ్'ను తమిళంలో 'వశీకర' పేరుతో రీమేక్ చేస్తే పెద్ద దెబ్బేసింది. ఇక 'అతడు'ను హిందీలో 'ఏక్: ది పవర్ ఆఫ్ వన్' పేరుతో రీమేక్ చేస్తే అట్టర్ ఫ్లాప్ అయింది. 'జులాయి'ని తమిళంలో 'సాగసం' పేరుతో 'అత్తారింటికి దారేది'ని 'వందా రాజాదా వరువేన్' పేరుతో రిలీజ్ చేస్తే ప్రేక్షకులు ఏమాత్రం నచ్చలేదు. ఇక తాజాగా త్రివిక్రమ్ కెరీర్లోనే బిగ్గెస్ట్ హిట్గా నిలిచిన 'అల వైకుంఠపురములో' సినిమాని హిందీలో 'షెహజాదా' పేరుతో రీమేక్ చేస్తే అదీ బాక్సాఫీస్ దగ్గర మరో దెబ్బేసింది. అంటే తెలుగులో ప్రేక్షకులు ఆదరించిన సినిమాలను సైతం ఇతర భాషలకు వెళ్లేసరికి అక్కడి ప్రేక్షకులు ఏమాత్రం ఆదరించడం లేదు. ఇక్కడ ప్రధానంగా ఒకే ఒక పాయింట్ కనిపిస్తోంది.

# 'పఠాన్' రికార్డ్ బద్దలు కొట్టేది ఆ ఇద్దరేనా?

షారుక్ ఖాన్ దాదాపు నాలుగేళ్ల విరామం తరువాత నటించిన మూవీ 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో యష్ రాజ్ ఫిలింస్ బ్యానర్ పై ఆదిత్య చోప్రా అత్యంత భారీ స్థాయిలో ఈ స్పై యాక్షన్ డ్రామాని నిర్మించారు. యష్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్ లో భాగంగా తెరకెక్కిన 'పఠాన్' కు ముందు నుంచీ ఎదురు దెబ్బలే తగిలాయి. టైటిల్ అనౌన్స్ మెంట్ వీడియో నుంచి ఈ మైఊవీపై బాయ్ కాట్ గ్యాంగ్ సంచలన ఆరోపణలు చేయడం తెలిసిందే. ఆ తరువాత దీపికా పదుకునే షారుక్ లపై చిత్రీకరించిన 'బేషరమ్ రంగ్' సాంగ్ లో దీపిక కాషాయం రంగు బికినీ ధరించి కనిపించడం టూ మచ్ ఎక్స్ పోజింగ్ చేయడంతో మరో వివాదం చుట్టుముట్టింది. 'పఠాన్'ని భారత్ లో నిషేధించాలని ఓ వర్గం డిమాండ్ చేయగా సాధువులు చాలా వరకు 'పఠాన్' మూవీతో పాటు షారుక్ ఖాన్ పై మండిపడ్డారు. సినిమాని బాయ్ కాట్ చేయాలంటూ నెట్టింట వైరల్ గా ప్రచారం చేశారు. అయితే అవన్నింటినీ తట్టుకుని కంటెంట్ బలంగా వుండటంతో వరల్డ్ వైడ్ బాక్సాఫీస్ వద్ద 'పఠాన్' వండర్స్ క్రియేట్ చేసింది. దేశ వ్యాప్తంగా ఊహించని విధంగా రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టి సంచలనం సృష్టించింది. ఏకంగా హిందీ వెర్షన్ లో 500 కోట్లు రాబట్టిన 'పఠాన్' మిగతా భాషల్లో కలిపి ప్రపంచ వ్యాప్తంగా 1000 కోట్ల మార్కుని దాటింది. ఈ నేపథ్యంలో 'పఠాన్' రికార్డుని కొట్టేది ఎవరు అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ రేసులో ప్రధానంగా టాలీవుడ్ టాప్ స్టార్స్ ప్రభాస్ అల్లు అర్జున్ ల పేర్లు వినిపిస్తున్నాయి. ప్రభాస్ నటిస్తున్న మూడు క్రేజీ సినిమాలు ఆది పురుష్ 'సలార్' ప్రాజెక్ట్ కె'. అయితే 'సలార్'తో ప్రభాస్ వెయ్యి కోట్ల మార్కుని టచ్ చేయడం గ్యారెంటీ అనే సంకేతాలు వినిపిస్తున్నాయి. 'ఆది పురుష్' విషయంలో ఫ్యాన్స్ ముందు నుంచి భయపడుతున్న నేపథ్యంలో అందరి దృష్టి 'సలార్'పైనే వుంది. ఇక ప్రభాస్ తరువాత బన్నీ కూడా ఈ రేసులో నిలుస్తాడని ఇన్ సైడ్ టాక్. బన్నీ ప్రస్తుతం 'పుష్ప 2'లో నటిస్తున్నాడు. దీనిపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. 'పుష్ప'తో సాధించలేని వసూళ్లని 'పుష్ప 2'తో దక్కించుకోవాలని ప్లాన్ చేసుకుంటున్నాడట. ఈ ఇద్దరి తరువాత సల్మాన్ ఖాన్ కూడా ఈ జాబితాలో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. సల్మాన్ ఖాన్ త్వరలో 'కిసీ క భాయ్ కిసీకి జాన్'తో రాబోతున్నా కానీ 'టైగర్ 3'తో మాత్రమే ఈ ఫీట్ ని సాధించి వెయ్యి కోట్ల మార్కుని చేరుకుంటాడని బాలీవుడ్ ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.

# రోహిత్.. నువ్వు ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టు: భారత క్రికెట్ దిగ్గజం

ఇంటర్నెట్ డెస్క్: బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆసీస్‌పై రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమ్ఇండియా వరుసగా రెండు టెస్టులను గెలిచింది. దీంతో నాలుగు టెస్టుల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో కొనసాగుతోంది. ఆసీస్‌పై తొలి టెస్టులో అద్భుత శతకంతో కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్ అందుకొన్నాడు. అయితే, రోహిత్ ఉత్తమంగానే బ్యాటింగ్ చేస్తున్నప్పటికీ.. ఓ విషయంలో మాత్రం క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ ఆందోళన వ్యక్తం చేశాడు. రోహిత్ తన ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాలని సూచించాడు. అతడు కాస్త అధిక బరువుతో ఉన్నట్లు కనిపిస్తోందని పేర్కొన్నాడు. "ఫిట్‌గా ఉండటం చాలా ముఖ్యం. అదీనూ ఓ కెప్టెన్‌గా ఇంకొంచెం దృష్టిపెట్టాలి. సారథే ఫిట్‌గా లేదంటే ఎంత అవమానం. అందుకే, రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై తీవ్ర కసరత్తు చేయాలి. నిజమే, అతడు గొప్ప



బ్యాటరే.. కానీ, ఫిట్‌నెస్ విషయం మాట్లాడుకుంటే అతడు అధిక బరువుతో ఉన్నట్లు అనిపిస్తోంది. టీవీలో చూస్తుంటే లావుగా అనిపించాడు. కానీ, నేను చూసిన వారిలో రోహిత్ గొప్ప ఆటగాడు.. గొప్ప కెప్టెన్.. అయితే, అతడు ఫిట్‌గా ఉండాల్సిన అవసరం ఉంది" అని కపిల్ దేవ్ తెలిపాడు. మార్చి 1వ తేదీ నుంచి భారత్ - ఆసీస్ జట్ల మధ్య మూడో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని భారత్ భావిస్తోంది. మరోవైపు ఆసీస్ కీలకమైన ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగబోతోంది. మూడో టెస్టులోనూ టీమ్ఇండియా గెలిస్తే ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరడం ఖాయం.

## సన్‌రైజర్స్‌కు కొత్త కెప్టెన్ వచ్చేశాడు..

హైదరాబాద్: ఐపీఎల్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ కు కొత్త కెప్టెన్ వచ్చేశాడు. ఆ జట్టు పగ్గాలను దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ ఏడెన్ మార్‌క్రమ్ )కు అప్పగించారు. ఈ విషయాన్ని సన్‌రైజర్స్ జట్టు గురువారం ట్విటర్ వేదికగా ప్రకటించింది. సన్‌రైజర్స్ జట్టుకు విదేశీ ఆటగాళ్లు నాయకత్వం వహించడం కొత్తేం కాదు. గతంలో కొన్నేళ్ల పాటు డేవిడ్ వార్నర్, ఆపై కేన్ విలియమ్సన్ నడిపించారు. మధ్యలో కొన్ని సార్లు భువనేశ్వర్ కుమార్‌కు కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించినా అది తాత్కాలికమే. అయితే ఇప్పుడు వార్నర్ విలియమ్సన్ ఇద్దరూ జట్టుకు దూరమైన సంగతి తెలిసిందే. వార్నర్ గత సీజన్లోనే సన్‌రైజర్స్‌ను వీడగా.. ఈ సీజన్‌కు ముందు విలియమ్సన్‌ను సన్‌రైజర్స్ విడిచిపెట్టింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190